ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -357 పేజీలు - 08 వెల - 04/- మంగళవారం 25 నవంబర్ 2025

## ప్రతీ కుటుంబానికి స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్

### సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం



**ఒకే కార్డుతో ప్రభుత్వ పథకాలు, పౌర సేవల పర్యవేక్షణ**

**రియల్ టైమ్ గవర్నెన్స్ డేటా లేక్ ద్వారా వివరాల సేకరణ**

**ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టంపై సీఎం చంద్రబాబు సమీక్ష**

**వచ్చే ఏడాది జూన్ నాటికి 1.4 కోట్ల కార్డుల జారీ లక్ష్యం**



**నవంబరు 24ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలో సుపరిపాలన అందించే దిశగా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పౌర సేవలను మరింత పారదర్శకంగా ప్రజలకు చేరవేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక విప్లవాత్మకమైన అడుగు ముందుకు వేసింది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని ఒక యూనిట్‌గా పరిగణించి, వారి సమగ్ర సమాచారంతో కూడిన 'స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్'ను జారీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మిగతా 2లో...



## కొత్త సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణస్వీకారం

**కొత్త సీజేఐకి శుభాకాంక్షలు తెలియజేసిన ప్రధాని నరేంద్ర మోదీ**

**2027 ఫిబ్రవరి 9 వరకు పదవిలో కొనసాగనున్న జస్టిస్ సూర్యకాంత్**

**పలువురు కేంద్ర మంత్రులు, విదేశీ న్యాయమూర్తులు హాజరు**

న్యూఢిల్లీ,**నవంబరు 24ఆంధ్ర ప్రగతి**

భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జస్టిస్ సూర్యకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన పదవీకాలం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు తన సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్'లో పేర్కొన్నారు. అనేక చారిత్రాత్మక తీర్పుల్లో భాగస్వామి అయిన జస్టిస్ సూర్యకాంత్, ఇటీవలి సంప్రదాయానికి భిన్నంగా దైవసాక్షిగా హిందీలో ప్రమాణం చేయడం విశేషం. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, కేంద్ర మంత్రులు, హర్యానా ముఖ్యమంత్రి నాయిబ్ సింగ్ సైనీ హాజరయ్యారుమిగతా 2లో...

## చదువుతోనే ఉజ్వల భవిష్యత్

**కొడంగల్‌లో రూ.5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్**

**అక్కడి అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్‌కు శ్రీకారం**

**సొంత నియోజకవర్గం పర్యటనలో సిఎం రేవంత్ రెడ్డి**

కొడంగల్,**నవంబరు 24ఆంధ్ర ప్రగతి**

మన పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని, అత్యున్నత స్థానంలో ఉండాలన్నదే తన ఆకాంక్ష అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ నోయిడాగా కొడంగల్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతాం అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఉన్నా ఇటువైపు చూడలేదని, అందుకే మీరిచ్చిన ఈ అవకాశంతో కొడంగల్‌ను తీర్చిదిద్దబోతున్నానని అన్నారు.మిగతా 2లో...



## మహిళా స్వయం సహాయక సంఘాలకు 304 కోట్లు

**విడుదలకు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

**అధికారులలో డిప్యూటి సిఎం వీడియో కాన్ఫరెన్స్**

హైదరాబాద్,**నవంబరు 24ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. తాజాగా మహిళా స్వయం సహాయక సంఘాలకు తెలంగాణ మిగతా 2లో...





## అమెరికా ఆంక్షలు.. భారీ డిస్కౌంట్‌తో భారత్‌కు రష్యా చమురు

**రష్యా సంస్థలపై అమెరికా ఆంక్షలు**

**రెండేళ్లలో ఎన్నడూ లేనంత తగ్గింపుకు చమురు**

**బ్యారెల్‌కు ఏడు డాలర్ల వరకు తగ్గింపు ధర**

రష్యా చమురుపై అమెరికా ఆంక్షలు విధించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, భారత్ కు భారీ డిస్కౌంట్‌తో ఆయిల్ విక్రయించేందుకు రష్యా సిద్ధమైంది. రష్యా అగ్రశ్రేణి చమురు ఉత్పత్తి సంస్థలైన రాస్‌నెఫ్ట్, లుకోయిల్‌లపై అమెరికా విధించిన ఆంక్షలు అమలులోకి వచ్చాయి. దీంతో క్రూడాయిల్ ధరలు భారీగా పతనమయ్యాయి. ఫలితంగా రష్యా నుంచి భారత్‌కు సరఫరా అయ్యే ముడి చమురు ధరలు గత రెండేళ్లలో ఎన్నడూ లేనంత తక్కువకు చేరాయి.
మిగతా 2లో...

## విద్య ద్వారానే సమాజంలో మార్పు



**సమాజంలో మార్పు కోసమే నైతిక విలువలతో కూడిన విద్య: మంత్రి నారా లోకేశ్**

**మహిళలను గౌరవించేలా పాఠ్యపుస్తకాల్లో మార్పులు తెస్తున్నామన్న లోకేశ్**

**పెట్టుబడులతో పాటు నైతిక విలువల్లోనూ ఏపీని అగ్రగామిగా నిలుపుతామన ధీమా**

**తల్లిదండ్రుల నమ్మకాన్ని విద్యార్థులు నిలబెట్టాలని పిలుపు**

**నవంబరు 24ఆంధ్ర ప్రగతి**

నైతిక విలువలతో కూడిన విద్య ద్వారానే సమాజంలో ఆశించిన మార్పు సాధ్యమవుతుందని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పెట్టుబడుల ఆకర్షణలోనే కాకుండా, నైతిక విలువలను పెంపొందించడంలోనూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలుపుతామని ఆయన ఉద్ఘాటించారు.
మిగతా 2లో...

## హైదరాబాద్‌లో డ్రగ్స్ ముఠాలపై ఎస్ఓటీ ఉక్కుపాదం

**ఒకేసారి 8 మంది డ్రగ్ పెడ్లర్లను అరెస్ట్ చేసిన మాదాపూర్ ఎస్ఓటీ**

**న్యూ ఇయర్ వేడుకలే లక్ష్యంగా బెంగళూరు నుంచి డ్రగ్స్ సరఫరా**

**నిందితుల నుంచి హెరాయిన్, ఎండీఎంఏ, గంజాయి స్వాధీనం**



2లో.

## ఆయుధాలు వదిలేస్తాం

### మావోయిస్టుల బహిరంగ లేఖ..

**ఫిబ్రవరి వరకు సమయం కోరిన మావోయిస్టులు**

**భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్లు ఆపేయాలని డిమాండ్**

**ఛత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర లను ఉద్దేశించి లేఖ**

న్యూఢిల్లీ,**నవంబరు 24ఆంధ్ర ప్రగతి**

మావోయిస్టులపై సీరియస్ గా దృష్టి పెట్టిన కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది మార్చిలోగా మావోయిస్టులను ఏరివేయాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. ఇందులో భాగంగా భద్రతా బలగాలతో కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహిస్తూ
మిగతా 2లో...



## ఏలూరు జిల్లాలో డిప్యూటి సిఎం పవన్ పర్యటన

**నరసింహాస్వామి ఆలయం సందర్శన**

**-పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

ఏలూరు, **నవంబరు 24ఆంధ్ర ప్రగతి**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏలూరు జిల్లాలోని కొయ్యలగూడెం, ద్వారకాతిరుమల మండలాల్లో సుడిగాలి పర్యటనలు చేశారు. ప్రత్యేక విమానంలో రాజమండ్రి చేరుకున్న ఆయన అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కొయ్యలగూడెం మండలం రాజవరం చేరుకున్నారు. పొంగుటూరు లక్కవరం మధ్య నిర్మిస్తున్న రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు డిప్యూటీ సీఎంకు వినతి పత్రాలు అందించారు. అనంతరం ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురానికి చేరుకొని సుందరగిరి లక్ష్మీనరసింహాస్వామిమిగతా 2లో...




## బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర కన్నుమూత

**కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ధర్మేంద్ర**

**ఇటీవల బీచ్ కాండీ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్న ధర్మేంద్ర**

**డిశ్చార్జ్ తర్వాత ఇంట్లో వైద్యుల పర్యవేక్షణలో ఉన్న బాలీవుడ్ నటుడు**



2లో.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ఆయుధాలు వదిలేస్తాం

(మొదటి పేజి తరువాయి)

మావోయిస్టులకు లొంగిపోవాలని సూచించింది. ఇటీవల జరిగిన పలు ఎన్ కౌంటర్లలో మావోయిస్టు కీలక నేతలు మరణించిన విషయం తెలిసిందే. పలువురు మావోయిస్టులు ఆయుధాలు వదిలిపెట్టి ప్రభుత్వానికి లొంగిపోతున్నారు. ఈ క్రమంలో తాజాగా మావోయిస్టులు ఓ బహిరంగ లేఖను విడుదల చేశారు. ఆయుధాలు వదిలిపెట్టి లొంగిపోవాలన్న ప్రభుత్వ సూచనపై ఈ లేఖలో సానుకూలంగా స్పందించారు.

అయితే, ఆయుధాలు వదిలేందుకు తమకు కొంత సమయం కావాలని, వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు సమయం ఇస్తే లొంగిపోతామని పేర్కొన్నారు. అప్పటి వరకు కూంబింగ్ ఆపరేషన్లను ఆపేయాలని, అడవులను జల్లెడ పడుతున్న భద్రతా బలగాలను వెనక్కి పిలిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఛత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో కూంబింగ్ ఆపరేషన్లు వెంటనే నిలిపివేయాలని ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులకు మావోయిస్టులు తమ లేఖలో విజ్ఞప్తి చేశారు. కూంబింగ్ ఆపరేషన్ నిలిపివేస్తే ఆయుధాలను వదిలే తేదీని ప్రకటిస్తామని తెలిపారు. ఈమేరకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్(ఎంఎంసీ) స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి అనంత్ పేరిట బహిరంగ లేఖ విడుదలైంది.

"ప్రస్తుత పరిస్థితుల్లో సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని మా పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ సోను దాదా నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని సమర్థిస్తూ ఎంఎంసీ స్పెషల్ జోనల్ కమిటీ ఆయుధాలను వదిలి వేయాలని భావిస్తోంది. అయితే, ఇందుకు ఫిబ్రవరి 15 వరకు సమయం కావాలి. ఈమేరకు గడువు ఇవ్వాలని ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నాం. ఇంత సమయం అడిగేందుకు ఇతర ఉద్దేశాలేమీ లేవు. ఆయుధాలను వదిలి పెట్టాలన్న నిర్ణయంపై సహచరులను సంప్రదించి అందరి ఆమోదం పొందేందుకు సమయం పడుతుంది. కమ్యూనికేట్ చేసేందుకు మాకు వేరే సులభ మార్గాలు లేనందున ఈ వ్యవధిని కోరుతున్నాం. ఈ సమయంలో పీఎల్జీఏ వారోత్సవాన్ని నిర్వహించండం సహా అన్ని కార్యకలాపాలను ఆపేస్తాం. అదే సమయంలో కూంబింగ్ ఆపరేషన్లను ఆపేయాలని ప్రభుత్వాలను కోరుతున్నాం" అని మావోయిస్టులు తమ లేఖలో పేర్కొన్నారు.

## కొత్త సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణస్వీకారం



(మొదటి పేజి తరువాయి)

వీరితో పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, భూటాన్, కెన్యా, మలేషియా, బ్రెజిల్, మారిషస్, నేపాల్, శ్రీలంక దేశాల ప్రధాన న్యాయమూర్తులు, ఇతర న్యాయమూర్తులు కూడా పాల్గొన్నారు.

జస్టిస్ సూర్యకాంత్ సుమారు 14 నెలల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఆయన 2027 ఫిబ్రవరి 9న పదవీ విరమణ చేస్తారు. జస్టిస్ సూర్యకాంత్ పేరును జస్టిస్ భూషణ్ ఆర్ గవాయ్ సిఫార్సు చేయగా, అక్టోబర్ 30న కేంద్ర ప్రభుత్వం ఆయన నియామకానికి ఆమోదం తెలిపింది. 1962 ఫిబ్రవరి 10న హర్యానాలో జన్మించిన జస్టిస్ సూర్యకాంత్, 1984లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 2000వ సంవత్సరంలో హర్యానాకు అత్యంత పిన్న వయస్కుడైన అడ్వకేట్ జనరల్‌గా నియమితులయ్యారు. అనంతరం పంజాబ్-హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి, 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఆయన జాతీయ న్యాయ సేవల అథారిటీ (నల్సా)లో కూడా కీలక సేవలు అందించారు.

## అమెరికా ఆంక్షలు.. భారీ డిస్కౌంట్‌తో భారత్‌కు రష్యా చమురు

(మొదటి పేజి తరువాయి)

అమెరికా ఆంక్షలు రష్యా చమురు వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో రష్యా ప్రధాన చమురు ఉరల్స్‌ను డెలివరీ ఆధారంగా బ్రెంట్ ముడి చమురు కంటే బ్యారెల్‌కు ఏడు డాలర్ల వరకు తగ్గింపుతో భారత రిఫైనరీలకు అందించేందుకు రష్యా సిద్ధమైంది. ఆంక్షలు లేనప్పుడు ఈ తగ్గింపు మూడు డాలర్లుగా ఉండగా, ఇప్పుడు రెండింతలు అయింది. తాజా తగ్గింపు ధరతో వచ్చే చమురు డిసెంబర్ నెలలో లోడ్ అయి జనవరిలో భారత్‌కు చేరే అవకాశం ఉంది. మూడేళ్ల క్రితం ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించిన తర్వాత నుంచి తక్కువ ధరల కారణంగా రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తోంది. నవంబర్ 21 నుంచి అమెరికా ఆంక్షలు అమల్లోకి రావడంతో భారతీయ రిఫైనరీలు రష్యా చమురు ఆర్డర్లను కొంతకాలం నిలిపివేశాయి. ఈ వారంలో ఉరల్స్ చమురు ధర భారీగా తగ్గడంతో భారత రిఫైనరీలు తిరిగి కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపాయి. ఆంక్షలు లేని సంస్థల నుంచి చమురు కొనుగోలుకు సిద్ధమయ్యాయి.

## హైదరాబాద్‌లో డ్రగ్స్ ముఠాలపై ఎస్ఓటీ ఉక్కుపాదం

**హైదరాబాద్‌నవంబరు 24ఆంధ్ర ప్రగతి**

హైదరాబాద్‌లో నూతన సంవత్సర వేడుకలను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ విక్రయించేందుకు యత్నిస్తున్న ముఠాలపై మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు దాడులు చేశారు. ఒకేసారి మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, 8 మంది డ్రగ్స్ పెడ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి భారీగా హెరాయిన్, ఎండీఎంఏ, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

వివరాల్లోకి వెళితే... చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపినగర్ వద్ద బస్సులో డ్రగ్స్ తరలిస్తున్న ముఠాను పక్కా సమాచారంతో పట్టుకున్నారు. బెంగళూరు నుంచి న్యూ ఇయర్ ఈవెంట్ల కోసం డ్రగ్స్ తీసుకువస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 15 గ్రాముల ఎండీఎంఏ, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో 4.5 గ్రాముల హెరాయిన్ అమ్ముతున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. మరోవైపు, కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిపిన దాడిలో 42 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడులపై సంబంధిత పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేసి, నిందితులను విచారిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# ప్రతీ కుటుంబానికి స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్

(మొదటి పేజి తరువాయి)

'ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం' (ఎఫ్‌బీఎంఎస్) అమలు ద్వారా కుటుంబ సాధికారిత సాధించాలని ఆయన స్పష్టం చేశారు. సోమవారం నాడు సచివాలయంలో ఎఫ్‌బీఎంఎస్‌పై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, పౌర సేవలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి, ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చవచ్చని అన్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి సాంకేతిక వెన్నెముకగా రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) ఆధ్వర్యంలోని డేటా లేక్‌ను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆర్టీజీఎస్ వద్ద ఉన్న సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకుని ఇతర శాఖలు కూడా వాడుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 1.4 కోట్ల కుటుంబాలకు వచ్చే ఏడాది జూన్ నాటికి క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ ఫ్యామిలీ కార్డులను పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ కార్డులో దాదాపు 25 రకాల వివరాలతో పాటు 'పీ4' లాంటి అంశాలను కూడా పొందుపరచాలని సూచించారు. కుటుంబంలోని సభ్యుల వ్యాక్సినేషన్ వివరాలు, ఆధార్, ఎఫ్‌బీఎంఎస్ ఐడీ, కుల ధృవీకరణ పత్రం, పౌష్టికాహార స్థితి, రేషన్ కార్డు, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, వృద్ధులు, వితంతువులకు అందే పెన్షన్ల వరకు అన్ని వివరాలను ఈ కార్డు ద్వారా ట్రాక్ చేసేలా వ్యవస్థను రూపొందించాలని అన్నారు. కేవలం పెన్షన్లు, రేషన్ వంటి పథకాలకు మాత్రమే ఈ వ్యవస్థను పరిమితం చేయవద్దని, పౌరులకు సంబంధించిన స్టాటిక్, డైనమిక్ డేటాను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ, వారి జీవితంలోని ప్రతి దశలో ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. కొన్ని పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో ఎదురవుతున్న సవాళ్లను ఈ వ్యవస్థ ద్వారా అధిగమించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వర్ణాంధ్ర విజన్ యూనిట్ ద్వారా కుటుంబ వివరాలు నిరంతరం అప్‌డేట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆధార్ సహా అన్ని వివరాలు ఈ ఒక్క కార్డు ద్వారానే తెలిసేలా పటిష్టమైన వ్యవస్థను సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. 2026 జనవరి నాటికి పూర్తి సమాచారాన్ని క్రోడీకరించి, జూన్ నాటికి కార్డుల పంపిణీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, ఆర్థిక, వైద్యారోగ్య, గ్రామవార్డు సచివాలయ, పురపాలక, ప్రణాళికా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విద్య ద్వారానే సమాజంలో మార్పు

(మొదటి పేజి తరువాయి)

విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన 'నైతిక విలువల'పై రాష్ట్రస్థాయి విద్యా సదస్సులో లోకేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, "సమాజంలో నైతిక విలువలను పెంపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గారు సంకల్పించారు. ఈ పవిత్రమైన బాధ్యతను నాపై ఉంచారు. దీనికోసం ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారిని కేబినెట్ ర్యాంకు హోదాతో ప్రభుత్వ సలహాదారుగా నియమించాం. ఎంతోమంది పదవుల కోసం ఆరాటపడతారు. కానీ చాగంటి గారు పదవిని స్వీకరించిన తర్వాత కనీసం ప్రభుత్వ వాహనం గానీ, ఇతర సౌకర్యాలు గానీ తీసుకోలేదు. ఆయన సెల్ ఫోన్ బిల్లు కూడా ఆయనే చెల్లించుకుంటున్నారు. అలాంటి గొప్ప వ్యక్తి మార్గనిర్దేశంలో మీ భవిష్యత్తు కోసం నైతిక విలువల పుస్తకాలను రూపొందిస్తున్నాం" అని తెలిపారు.



**విద్యా వ్యవస్థలో సంస్కరణలు**

ప్రభుత్వం విద్యా వ్యవస్థలో చేపట్టిన సంస్కరణలను లోకేశ్ ఏకరువు పెట్టారు. "కేవలం 150 రోజుల్లో ఒక్క లిటిగేషన్ లేకుండా 16,347 టీచర్ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేశాం. టీచర్ల బదిలీల కోసం పారదర్శకమైన చట్టం తెచ్చాం. కేజీ నుంచి పీజీ వరకు పాఠ్యప్రణాళికను ప్రక్షాళన చేస్తున్నాం. విద్యార్థులకు అందించే కిట్స్‌పై నాయకుల ఫోటోలు తొలగించి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరు పెట్టాం. మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ గారి పేరు పెట్టాం. ప్రతి శనివారాన్ని 'నో బ్యాగ్ డే'గా ప్రకటించాం. తల్లిదండ్రులు మీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మీపై ఉంది" అని విద్యార్థులకు సూచించారు.

ఈ బృహత్తర కార్యక్రమంలో చాగంటి కోటేశ్వరరావు గారు తమకు దిశానిర్దేశం చేయాలని లోకేశ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏలూరు జిల్లాలో డిప్యూటి సిఎం పవన్ పర్యటన





(మొదటి పేజి తరువాయి)

ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌కు అధికారులు, ఆలయ సిబ్బంది పూర్ణ కుంభంతో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారికి పవన్ కల్యాణ్ పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. ఐఎస్ జగన్నాథపురం గ్రామం నుంచి సుందరగిరి కొండపైకి వెళ్లే రహదారితో పాటు, ఆలయ ప్రదక్షిణ మండప పనులకు పవన్ ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నూతనంగా చేపట్టిన మ్యాజిక్ డ్రైన్ పనులను డిప్యూటీ సీఎం పరిశీలించారు. ఇక, పవన్ పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. అయినా పవన్ కల్యాణ్‌ని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజల పెద్ద ఎత్తున ప్రాంతానికి తరలి వచ్చారు. గత ఏడాది డిసెంబర్‌లో ఐఎస్ జగన్నాథపురం లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మరో మారు స్వామి వారి దర్శనానికి రావడం, ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు గ్రామంలో పలు అభివృద్ధి పనులను చేపట్టడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పవన్ కల్యాణ్ పర్యటనకు జిల్లా ఇంఛార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ తో పాటు పలువురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

**తిరుమల భక్తుల విశ్వాసం దెబ్బతీసిన వైకాపా**

**ఆనాటి బోర్డు అకృత్యాలతో కల్తీలడ్డూ వ్యవహారం**

**ఎక్స్ వేదికగా వార్తను పోస్టో చేసని పవన్ కళ్యాణ్**

వైకాపా ప్రభుత్వంలో టిటిడిబోర్డు, అధికారులు భక్తుల హృదయాలను విచ్ఛిన్నం చేశారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీపై ఓ ఆంగ్ల పత్రికలో వచ్చిన వార్తను ఆయన ఎక్స్ వేదికగా పంచుకున్నారు. అప్పట్లో 20 కోట్ల కల్తీ లడ్డూలు విక్రయించారని ఆ వార్తలో పేర్కొన్నట్లు చెప్పారు. తిరుమల కేవలం ఆలయం కాదు.. మన భక్తికి మూలం. ఎంతో భక్తిభావంతో అక్కడికి వెళ్తాం. 2019-24 మధ్య రోజుకు 60వేల మంది చొప్పున దాదాపు 10.97 కోట్ల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో రాష్ట్రపతి, ప్రధానితో పాటు రాజ్యాంగబద్ధమైన పదువులు చేపట్టినవారు, వివిధ రంగాల ప్రముఖులూ ఉన్నారు. వారందరి నమ్మకాన్ని గత పాలక మండలి వమ్ము చేసింది. మన విశ్వాసాల్ని విచ్ఛిన్నం చేసిందని పవన్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

# చదువుతోనే ఉజ్వల భవిష్యత్

(మొదటి పేజి తరువాయి)

రాబోయే కొన్ని నెలల్లో కొడంగల్ రైల్వే పనులు ప్రారంభమవుతాయి. నియోజకవర్గంలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయబోతున్నాం అని అన్నారు. కొడంగల్‌లో ఏ విద్యార్థి ఆకలితో ఉండకూడదన్న లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 28 వేల మందికి ఉదయం అల్పాహారం అందిస్తున్నామన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో 5 వేల మంది విద్యార్థులు పెరిగారని చెప్పారు. సొంత నియోజకవర్గం కొడంగల్ పర్యటనకు వెళ్లిన రేవంత్ రెడ్డి.. అక్కడి అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్‌ను పరిశీలించారు. మిడ్‌డే మీల్స్ కిచెన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జీవితాల్లో మార్పు రావాలంటే పిల్లల్ని చదివించాలన్నారు. కొడంగల్‌లో రూ.5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో తొలి సైనిక్ స్కూల్‌ను ఇక్కడే ఏర్పాటు చేయబోతున్నాం. 16 నెలల్లోగా కొడంగల్‌ను అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా తయారు చేస్తాం అని ప్రకటించారు. మహిళలు ఆత్మగౌరవంతో బతికేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రంలోని ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. మహిళలకు

ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. వెయ్యి ఆర్టీసీ బస్సులకు వారిని యజమానులుగా చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులకు కూడా యజమానులను చేశాం అని వెల్లడించారు. అదానీ, అంబానీలతో పోటీపడేలా వారిని ప్రోత్సహిస్తున్నాం. మహిళా సంఘాల ఉత్పత్తులు అమెజాన్‌లో అమ్ముకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం అని అన్నారు. మూడు నెలల్లో కొడంగల్‌లోని ప్రతి గ్రామానికి కృష్ణా నీళ్లు అందిస్తాం. లగచర్ల పారిశ్రామికవాడకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తాం. త్వరలో సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయి. 3, 4 రోజుల్లో సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. అభివృద్ధికి మద్దతుగా ఉండేవారిని సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలని రేవంత్ పిలుపునిచ్చారు. ప్రజలకు కోట్ల రూపాయలు ఇవ్వలేనని.. పిల్లలకు అంతకంటే విలువైన చదువు చెప్పించగలనని అన్నారు. చదువు జీవితాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని అన్నారు. అందులో భాగంగా కొండంగల్ లో 5 వేల కోట్ల రూపాయలతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మించుకున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సిఎం పలు అభివృద్ధి కార్యక్రామలు చేపట్టడంతో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి పనులకు కొత్త ఊపు వచ్చింది. మొత్తం రూ.103 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, పట్టణాభివృద్ధి నుంచి విద్య, సంక్షేమం వరకు అనేక రంగాల్లో ఈ పనులు ప్రారంభమవడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా, నియోజకవర్గంలో మొత్తం 28 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.5.83 కోట్లు, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో 23 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.5.01 కోట్లు కేటాయించారు. గ్రామీణ పరిపాలనను బలోపేతం చేసేందుకు 10 గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.3 కోట్లు వెచ్చించనున్నారు. బంజారా భవన్‌లో అదనపు సౌకర్యాల కోసం కాంపౌండ్ వాల్, డైనింగ్ హాల్, నీటి సరఫరా, విద్యుదీకరణకు కలిపి రూ.3.65 కోట్లు మంజూరు చేశారు. కొడంగల్ పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ, ప్రొహిబిషన్ / ఎక్సైజ్ స్టేషన్ నిర్మాణానికి రూ.1 కోటి, అగ్నిమాపక కేంద్రానికి రూ.1.30 కోట్లు, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి రూ.1.40 కోట్లు కేటాయించారు. అలాగే కమ్యూనిటీ హాళ్లు, కిచెన్ షెడ్లు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణానికి రూ.4.91 కోట్లు, సీసీ రోడ్లు , భూగర్భ డ్రైనేజ్ (జఉఆ) వ్యవస్థ అభివృద్ధికి రూ.4.45 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే నిర్మించిన అదనపు తరగతి గదులు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రంథాలయ భవనాల ప్రారంభోత్సవం కూడా ఈ సందర్భంగా జరిగింది, వీటి కోసం రూ.2.95 కోట్లు వెచ్చించారు. కొడంగల్ పట్టణ అభివృద్ధి దిశగా అత్యంత కీలకంగా పరిగణిస్తున్న రోడ్డు విస్తరణ పనులకు ఒక్కటే రూ.60 కోట్లు కేటాయించగా, కొత్త గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేశారు.

# మహిళా స్వయం సహాయక సంఘాలకు 304 కోట్లు

(మొదటి పేజి తరువాయి)

ప్రభుత్వం మరో శుభవార్త చెప్పింది. ఈ మహిళా సంఘాలకు రూ. 304 కోట్ల వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం విడుదల చేసింది. 3,57,098 గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో ఈ నిధులను జమ చేసింది. సోమవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క ఆధ్వర్యంలో జిల్లా డీఆర్‌డీఏ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఈ నిధులను మహిళలకు అందచేయనున్నారు. నియోజకవర్గాల వారీగా కార్యక్రమం జరుగుతుందని డిప్యూటి సిఎం భట్టి వెల్లడించారు. ములుగు జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క.. ఏటూరు నాగారం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాతి అని తెలిపారు. ఆడబిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వేల కోట్ల రూపాయల నిధులను సమకూరుస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలకు వడ్డీ భారం లేకుండా ప్రభుత్వమే వాటిని చెల్లిస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ. 3,500 కోట్ల వడ్డీలను ఎగవేసిందంటూ బీఆర్ఎస్ పార్టీపై ఈ సందర్భంగా సీతక్క మండిపడ్డారు. అంతే కాకుండా స్వయం సహాయక సంఘాల్లోని మహిళల పొదుపు సొమ్మును సైతం గత ప్రభుత్వం కాజేసిందని విమర్శించారు. అక్కా చె÷-లలెమ్మల కష్టార్జితమైన అభయహస్తం నిధులను కూడా ప్రభుత్వం మింగేసిందన్నారు. కానీ తమ ప్రజా ప్రభుత్వం మహిళల సాధికారత కోసం ఎన్నో పథకాలను ప్రారంభించిందని గుర్తు చేశారు. మహిళలకు నిధులను సమీకరించడమే కాదు.. ఈ వడ్డీలను కూడా సకాలంలో చెల్లిస్తున్నామని చెప్పారు. ఆడబిడ్డల కష్టాన్ని కాజేసి కన్నీళ్ళకు కారణమైన బీఆర్ఎస్ పెద్దలకు మహిళా సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు లేదంటూ ఆ పార్టీ నేతలకు సూచించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రతి ఏడాది రూ. 25 వేల కోట్లు తగ్గకుండా బ్యాంక్ లింకేజీ రుణాలను తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందని సీతక్క వివరించారు. ఈ సంఘాలకు క్రమం తప్పకుండా వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందిస్తుంది. తాజాగా రూ. 304 కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. మహిళా సంఘాల ఖాతాల్లో ఈ నిధులు జమ అయినాయి.

# రీఓపెన్ దరఖాస్తులను నాణ్యతతో క్లియర్ చేయండి.

**ఆడిట్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి.**

**పిజిఆర్ఎస్ లో స్వీకరించిన 220 దరఖాస్తులు.**

**కలెక్టర్ రాజకుమారి గణియా.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 24:**
ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రీఓపెన్ అయిన దరఖాస్తులను నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల వేదిక కార్యక్రమం ద్వారా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రీఓపెన్ అయిన 479 దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే క్లియర్ చేయాలని కలెక్టర్ సంబంధిత ఆర్డీవోలు, తాసిల్దారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి ఎంతో దూరం నుండి అర్జీదారులు మన దగ్గరికి వస్తారని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్మెంట్ లు స్పష్టంగా, నాణ్యంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. బియాండ్ ఎసిఏ లో వున్న 5 దరఖాస్తులు, ఇంకా చూసుకోని దరఖాస్తులు 63 ఉన్నాయని... ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. అలాగే విఐపి గ్రీవెన్స్‌లను అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. పెండింగ్ లో ఉన్న ఆడిట్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే క్లియర్ చేయాలన్నారు.

**పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని ప్రజా సమస్యలు**

నంద్యాల జిల్లా, బేతంచెర్ల మండలానికి చెందిన కే. రమేష్ తనకు ప్రస్తుతం రూ. 6,000 పెన్షన్ వస్తోంది. నేను పూర్తిగా వికలాంగుడిని, మంచానికే పరిమితమై ఉన్నాను. కాబట్టి నాకు అందుతున్న పెన్షన్‌ను రూ. 15,000కు పెంచవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు.
నంద్యాల జిల్లా, ప్యాపిలి మండలం, కలచర్ల గ్రామానికి చెందిన యు. చిరంజీవి తనకున్న పొలం "సర్వే నెంబర్ 55/2లోని నా 1.60 ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది. కాబట్టి సంబంధిత భూభాగాన్ని సర్వే చేసి ఆక్రమణలను తొలగించవలసిందిగా కోరుతూ జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు. నంద్యాల జిల్లా, పాములపాడు మండలం, గంగాధర నెల్లూరు గ్రామానికి చెందిన పువ్వాడ ఉమామహేశ్వరి తనకున్న సర్వే నెంబర్ 142/1లో నాకు చెందిన 5 ఎకరాల భూస్వామ్యాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయవలసిందిగా కోరుతూ జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 220 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు సమర్పించారు. స్వీకరించిన అర్జీలన్నింటిని నిర్ణీత గడువులోపు పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

## సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి అందరూ సహకరించండి.


**-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 24:**ప్రతి సంవత్సరం డిసెంబర్ 7న దేశవ్యాప్తంగా నిర్వహించే సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా సైనికుల సంక్షేమ నిధికి జిల్లా ప్రజలు ఉదారంగా చేయూత అందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ఫ్లాగ్ డే పోస్టర్లను కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సైనిక సంక్షేమ అధికారి ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో శత్రువులను ఎదుర్కొంటూ, అంతర్గత విపత్తుల సమయంలో ప్రజలను రక్షిస్తూ సాయుధ దళాలు దేశం కోసం అపారమైన త్యాగాలు చేస్తున్నాయని పేర్కొన్నారు. వారి సేవలు, త్యాగాలను స్మరించుకునేందుకు, వారి కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఫ్లాగ్ డే నిధి సేకరణ చేపడతామని తెలిపారు. వరదలు, భూకంపాలు వంటి విపత్తుల్లో ప్రజలను రక్షించడం నుండి ఉగ్రవాద కార్యకలాపాలను అణచివేయడం వరకు భారత సైన్యం కీలక పాత్ర పోషిస్తోందని ఆమె గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ప్రతి పౌరుడు తన వంతు సహాయం అందించాలని సూచించారు.

## హెచ్.ఐ.వి, ఎయిడ్స్‌పై సరైన అవగాహన పెంపొందించండి.

**నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 24:**ప్రజల్లో హెచ్.ఐ.వి మరియు ఎయిడ్స్‌పై సరైన అవగాహన పెంపొందితేనే జిల్లాను ఎయిడ్స్ రహిత జిల్లాగా మార్చడం సాధ్యమని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా వైద్య %ఆ% ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నియంత్రణ మరియు నివారణ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్.ఐ.వి/ఎయిడ్స్ చట్టం%-%2017 మరియు తల్లి%-%బిడ్డ రక్షణపై అవగాహన కల్పించే గోడ పత్రికను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో హెచ్.ఐ.వి మరియు ఎయిడ్స్‌పై సరైన అవగాహన పెంపొందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లాను ఎయిడ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు పెద్ద ఎత్తున కృషి చేయాలన్నారు. ఈ చట్టం గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగేలా విస్తృత ప్రచారం చేయాలని సంబంధిత శాఖాధికారులకు ఆమె సూచించారు. గోడ పత్రికలను జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులకు పంపిణీ చేయాలని తెలిపారు. హెచ్.ఐ.వి/ఎయిడ్స్ బాధితులపై వివక్ష లేకుండా సమాజంలో సానుకూల దృక్పథం పెంపొందించడం, అలాగే తల్లిలో నుండి శిశువుకు హెచ్.ఐ.వి సంక్రమణను నివారించేందుకు ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించడం ఈ ప్రచార పత్రిక ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ పేర్కొన్నారు.

# ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలను పరిష్కరించండి.

**నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్లను ఏర్పాటు చేయండి.**

**డ్రోన్ వినియోగ వివరాలను ప్రతిరోజూ నమోదు చేయండి.**

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 24:**
జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిందిగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నవంబర్ 7న జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో ప్రతినిధులు ప్రస్తావించిన అంశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. నందికొట్కూరు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని మద్యం దుకాణం విద్యార్థుల్లో చెడు అలవాట్లకు దారితీస్తోందని వచ్చిన ఫిర్యాదుపై దాన్ని తొలగించే చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్



సూపరింటెండెంట్ ను ఆదేశించారు. ఇదే మండలంలో నిర్మిస్తున్న ఎన్హెచ్ 340 సి రహదారి కారణంగా బ్రాహ్మణకొట్కూరు రైతులు సాగు భూములకు వెళ్లలేకపోతున్నందున సమస్యను పరిష్కరించాలని ఎన్హెచ్ అధికారులను ఆదేశించారు. హంద్రీ%-%నీవా కెనాల్ పనుల్లో పొలాల్లో పడిన ఇసుకను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల, గ్రామ స్థాయిలో జరిగే సమావేశాలకు జడ్పిటిసి, ఎంపీటీసీలను ఆహ్వానించడం లేదని వచ్చిన ఫిర్యాదులపై ప్రోటోకాల్ ప్రకారం తప్పనిసరిగా ఆహ్వానం పంపాలని డిప్యూటీ సీఈఓకు ఆదేశాలు జారీ చేశారు. కొత్తపల్లి మండలంలో రీసర్వే పనులకు తహశీల్దార్ హాజరు కాకపోవడం పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బన్నూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఈఈ, వ్యవసాయ అధికారులకు సూచించారు. అలాగే ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనుల కేటాయింపులో లోపాలు రాకుండా చూడాలని ఆదేశించారు. డిసిల్టింగ్ పనులు బండ్ బలపరచే విధంగా ఉండాలని, దుద్యాల గ్రామంలోని చెరువు అక్రమణలను తొలగించాలని కూడా కలెక్టర్ స్పష్టం చేశారు. దేవాదాయ శాఖకు చెందిన కురుకుంద గ్రామ దేవాలయాలకు సంబంధించిన గెజిట్ వివరాలు ఇవ్వాలని దేవాదాయశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. శనగ విత్తనాల పంపిణీ అర్హులైన రైతులకు పూర్తిగా జరగాలని సూచించారు. జిల్లాలో ఏర్పాటుచేయాల్సిన 7 నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్లలో పాణ్యం, ఆత్మకూరు, ఆళ్లగడ్డ యూనిట్లు ఇంకా ప్రారంభం కాలేదని, వీటిని త్వరితగతిన ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలకు అందజేసిన డ్రోన్ల వినియోగాన్ని ప్రతిరోజూ డ్రోన్ మార్ట్‌లో నమోదు చేయాలని, ఎన్ని గంటలు ఫ్లై చేశారో, ఏ పనులకు వినియోగించారో శాఖాపరమైన ఈమెయిల్ ఐడీలతో కలెక్టరేట్‌కు పంపాలని కలెక్టర్ సూచించారు.

## పోలీస్ కానిస్టేబుల్ ట్రైనింగ్ ను ప్రారంభించాలనిమంత్రి ఫరూక్ కు వినతి పత్రం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 24:** గత ప్రభుత్వంలో కోర్టు కేసులు కారణంగా చూపించి నిలిపివేసిన కానిస్టేబుల్ నియామకాలను నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం కోర్టు కేసులు తోరితగతిన పరిష్కరించి పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలు ప్రకటించిన కూటమి ప్రభుత్వానికి నిరుద్యోగ అభ్యర్థులు తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఫలితాలు ప్రకటించి మూడు నెలలు కాలం పూర్తి కావడం జరిగిందని ట్రైనింగ్ కు సంబంధించి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులలో కొంత గందరగోల పరిస్థితి ఏర్పడిందని ఈ ట్రైనింగ్ కు సంబంధించి ఒక స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని అలాగే ట్రైనింగ్ సమయంలో ఇచ్చే స్టైఫండ్ 4500 అనేది ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పెంచాలని ట్రైని అభ్యర్థుల పోలీస్ కానిస్టేబులు నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి. ఫరూక్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఫరూక్ ఈ విషయాన్ని సంబంధించి శాఖ వారికి పంపించి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

# పిఎంఏవై గ్రామిన్ పథకం అర్హుల జాబితా ఈనెల 30వ తేదీ లోపల పూర్తి చేయాలి.

**వాహన ఆధార్ సీడింగ్ కార్యక్రమం పూర్తిచేయాలి.**

**చిల్డ్రన్స్ ఆధార్ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి.**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 24:**
పిఎంఏవై గ్రామిన్ పథకం అర్హుల జాబితా ఈనెల 30వ తేదీ లోపల పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని ఎన్ఐసి విసి హాల్ నుంచి ఆర్డీవోలు, తాసిల్దార్ లు, ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు, డిపిఓ తదితర అధికారులతో పలు అంశాలపై జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా జూమ్ విసీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ....ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా జిల్లాలో ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి అర్హుల జాబితాను ఈనెల 30వ తేదీ లోపల ఆవాస్ ప్లస్ 2024 యాప్ నందు అప్లోడ్ చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 28,724 మందికి గాను 13,187 అడుగులను గుర్తించడం జరిగిందని ఇంకా 14,981 మంది అర్హులను గుర్తించాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి హౌసింగ్ అధికారులు, వర్క్ ఇన్స్పెక్టర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మొత్తం 488 మంది మంది సిబ్బంది సిబ్బందిని కేటాయించడం జరిగిందని వీరందరూ సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఆటో డ్రైవర్ల వాహన ఆధార్ సీడింగ్ కార్యక్రమం పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు.
చిల్డ్రన్ ఆధార్ నమోదుకు సంబంధించి 6 నెలల నుంచి 5 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలందరికీ శిశు ఆధార్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, ఈ కార్యక్రమానికి సంబంధించి డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్లు సమస్య ఉంటే వెంటనే వైద్యాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. ఐదు సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల పిల్లలకు మ్యాండేటరీ బయోమెట్రిక్ కార్యక్రమాన్ని వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇందుకు సంబంధించి ఆధార కేంద్రాలలో ఎటువంటి సమస్యలున్న వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. మ్యాండేటరీ బయోమెట్రిక్ సంబంధించి జిల్లాలో 1,20,000 చేయాల్సి ఉండగా ప్రస్తుతం 14,000 పూర్తి చేయడం జరిగిందని త్వరితగతిన ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు.
కౌశలం సర్వే కార్యక్రమానికి సంబంధించి జిల్లాలో పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ చదివిన విద్యార్థుల డేటాను సేకరించి వీరందరికీ స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. దీంతో కౌశలం సర్వే కార్యక్రమాన్ని గడువులోగా చేయాలన్నారు.
స్వర్ణ పంచాయతీ కార్యక్రమానికి సంబంధించి ఇంటి పన్ను ఆన్లైన్ పేమెంట్ కార్యక్రమాలు నిర్దేశించిన గడుగు లోపల పూర్తి చేయాలన్నారు. ఇందుకు సంబంధించి ఆధార్, మొబైల్ నెంబర్ల మ్యాపింగ్ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో శానిటేషన్ సమస్య తలెత్తకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధించి బండి ఆత్మకూరు, బేతంచెర్ల, గోస్పాడు, మండలాలలో దృష్టి సారించాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు సంబంధించి జీతాలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని జిల్లా పంచాయతీ అధికారికి సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి..: మంత్రి ఎన్ఎండి ఫరూక్.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 24:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సోమవారం నాడు నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ వేదిక ద్వారా పలువురు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మంత్రి ఫరూక్ స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఆయన తక్షణమే ఆయా సమస్యలకు సంబంధించిన శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. నంద్యాల నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రభుత్వం తరఫున, తెలుగుదేశం పార్టీ తరఫున నిరంతరం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## చంద్రబాబు కు కృతజ్ఞతలు తెలిపిన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్.

**ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 24:**
రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తుల వివరాలను సెంట్రల్ పోర్టల్ లో నమోదు కోసం గడువు పొడిగించాలని కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కు లేఖ వ్రాసారు. వక్ఫ్ ఆస్తి వివరాలను సెంట్రల్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడానికి గడువు డిసెంబర్ 5వ తేది తో ముగియనున్నది. రాష్ట్రంలో దాదాపు 4,748 రిజిస్టర్డ్, 10,000 దాకా అన్ రిజిస్టర్డ్ వక్ఫ్ ఆస్తులు ఉన్నాయని, ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 3,100 ఆస్తులకు వివరాలను విజయవంతంగా అప్‌లోడ్ చేసినప్పటికీ, సాంకేతిక సమస్యలు, స్టేక్ హోల్డర్ల సమస్యల కారణంగా పురోగతికి క్షేత్రస్థాయిలో ఇబ్బందులు కలగడం జరుగుతున్నదని లేఖలో సీఎం చంద్రబాబు




వివరించారు. ఆస్తుల నమోదు ప్రక్రియ వేగం పుంజుకున్నప్పటికి డిసెంబర్ 5వ తేదీ నాటికి అన్ని రిజిస్టర్డ్, రిజిస్టర్ కాని ఆస్తులకు సంబంధించిన మిగిలిన అప్‌లోడ్ పనిని పూర్తి చేయడం కోసం గడువు సరిపోదని వెల్లడించారు. ఈ గడువును దాటితే ఇది వక్ఫ్ ఆస్తుల చట్టపరమైన అంశాలపై ప్రభావం చూపుతుందనే ఆందోళన వాటాదారులలో ఉందని పేర్కొన్నారు. వక్ఫ్ ఆస్తుల రక్షణకు 100 శాతం చర్యల కోసం, ఖచ్చితమైన డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడానికి ప్రస్తుత గడువును 12 నెలలు పొడిగించాలని సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రికి రాసిన లేఖలో కోరారు. వక్ఫ్ ఆస్తుల రక్షణను దృష్టిలో పెట్టుకుని మరో ఏడాది పాటు గడువు పెంపు కోసం లేఖ రాసిన సీఎం చంద్రబాబుకు మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కృతజ్ఞతలు తెలుపుతూ అమరావతిలో సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

# విచారణ జరిపి ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం అందిస్తాం..!

## - ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ నవంబర్ 24:**
నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఫిర్యాదిదారుల నుంచి 82 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూసుకోవాలని,ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ఆదేశించారు.

1.ఇంటి స్థలం ఇప్పిస్తానని ఆరు లక్షలకు గాను నాలుగు లక్షలు తీసుకొని ఇంతవరకు ఇంటి స్థలం ఇవ్వకుండా డబ్బులు తిరిగి ఇవ్వకుండా నరసింహులు మోసం చేసినాడని నాకు న్యాయం చేయండని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన భువనేశ్వరి జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు. 2.తప్పుడు దస్తావేజులు సృష్టించి తనది కానీ స్థలాన్ని తనదేనని నమ్మించి పది లక్షల రూపాయలు బెస్త. నాగరాజు తీసుకొని మోసం చేసినాడు నాకు న్యాయం చేయండని యాళ్ళూరు గ్రామానికి చెందిన మహమ్మద్ హుస్సేన్ జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.

3.యర్రగుంట్ల గ్రామం నందు అంగన్వాడి ఆయా గా ఉద్యోగం ఇప్పిస్తానని కాలూరి ఇమ్మానియేల్ నా వద్ద నుండి 2,50,000/- రూపాయలు తీసుకొని ఉద్యోగం ఇప్పించకుండా డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేసినాడని నాకు న్యాయం చేయండి నంద్యాల పట్టణానికి చెందిన డి.కాశమ్మ జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.

4.ప్రతి నెల డబ్బులు ఇస్తానని ఖాజా హుస్సేన్ నా ట్రాక్టర్ తీసుకొని పోయి డబ్బులు ఇవ్వకుండా ట్రాక్టర్ తెచ్చి ఇవ్వకుండా నన్ను మోసం చేసినాడని నేను ఇంటి దగ్గరకు వెళ్లి అడిగితే బెదిరిస్తున్నాడని నాకు న్యాయం చేయండని వెలుగోడు గ్రామానికి చెందిన ముర్తుజావలి జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.

# శిరివెళ్లలో ఘనంగా అయ్యప్ప స్వామి మెట్ల పడి పూజ.





**ఆంధ్ర ప్రగతి సిరివెళ్ల నవంబర్ 24:** కడప జిల్లా కలసపాడు మండలం తెల్లపాడు గ్రామంలో కర్నాటి మధు రెడ్డి రమణారెడ్డి గురు స్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మెట్ల పూజ సోమవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ప్రతిమ విగ్రహానికి పంచామృతాభిషేకాలు మరియు విశేష పూజలు నిర్వహించి అయ్యప్ప స్వామి భజనలతో ఆనందబరితులను చేశారు. ఈ సందర్భంగా గురు స్వామి మాట్లాడుతూ కలియుగ ఆరాధ్య దైవం అయినటువంటి కారణజన్ముడు శ్రీ అయ్యప్ప స్వామి పూజ ఫలితం ఎంతో అద్భుతంగా ఉంటుందని ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామిని సేవించి అనంతరం దర్శనార్థం శబరిమల అయ్యప్ప స్వామి సన్నిధి చేరుకుని పావని బంగారు మెట్లని ఎక్కి అయ్యప్ప స్వామి దర్శనం చేసుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి పూజకు విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు మరియు పంచామృత ప్రసాద వితరణ అనంతరం అల్పాహార అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# జిల్లా ప్రభుత్వ వైద్యశాల లో ఉన్న సమస్యలను పరిష్కారం చేయకపోతే దశలవారీగా ఆందోళనలు ఉధృతం చేస్తాం.

**రోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని వినతి తీసుకోవడానికి నిరాకరించిన ఆర్ఎంవోపై చర్యలు తీసుకోవాలి.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 24:**
నంద్యాల జిల్లా ఏర్పాటైన నాటి నుండి నేటి వరకు నంద్యాల పట్టణంలోని జిల్లా జనరల్ ఆసుపత్రిలో సమస్యలు విలయతాండవం చేస్తున్న పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయడం లేదని వెంటనే రోగుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆసుపత్రి ఎదుట నిరసన కార్యక్రమం తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా నరసింహులు అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ నాగరాజు వి ఏసురత్నం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్,పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కే మహమ్మద్ గౌస్, పి వెంకట లింగం,మౌలాలి పట్టణ కమిటీ సభ్యులు జైలాన్ లతోపాటు సత్యం, కేశాలు,నాగేంద్ర, రవి, రాణా, హుసేని, గోరెభాష లతో పాటు మరో 50 మంది పార్టీ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ నాగరాజు, యేసురత్నం, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ లు మాట్లాడుతూ నంద్యాల జిల్లా అయినా తర్వాత అన్ని ప్రాంతాల నుండి వేలాదిమంది రోగులు నిత్యం వస్తున్నారని వారికి సరిపడే విధంగా ఓపి సెంటర్లు లేవని ఓపి సెంటర్ల సంఖ్యను వెంటనే పెంచాలని,డేటా ఆపరేటర్లతో పని చేయించాలని, అదేవిధంగా మారుతున్న పరిస్థితులలో గుండె జబ్బులు ఎక్కువ అవుతున్నాయని, రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లలేక సరైన సమయాలలో డబ్బులు లేక చనిపోవడం జరుగుతుందని, వెంటనే కార్డియాలజీ విభాగం ను ఏర్పాటు చేయాలని, ఆస్పత్రిలో అన్ని రకాల మందులు సరిపడా లేవని రోగులకు, ప్రజలకు అందుబాటులోకి 24 గంటలు తీసుకువచ్చేలా జనరిక్ మందుల షాప్ ఏర్పాటు చేయాలని,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పిన విధంగా గర్భిణి లను నార్మల్ డెలివరీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని, నంద్యాల కు మెడికల్ కాలేజీ ఏర్పాటైన తర్వాత కూడా ఆసుపత్రిలో రోగుల సంఖ్య కు అనుగుణంగా సిబ్బంది నియామకాలు చేపట్టలేదని, వెంటనే ఖాళీగా ఉన్న సిబ్బంది నియామకాలను చేపట్టాలని, ఆసుపత్రికి రోగులను చూసేందుకు బంధువులు వందలాదిమంది వస్తున్నారని ఇక్కడ భోజనం చేసుకునేందుకు, విశ్రాంతి తీసుకునేందుకు సరిపడా వసతి సదుపాయాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కారం చేయాలని లేకుంటే సిపిఎం పార్టీగా దశలవారీగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అనంతరం వినతిపత్రం అందించేందుకు వెళ్లగా ఆస్పత్రి సూపరిండెంట్ లేకపోవడంతో అక్కడ ఉన్న ఆర్ఎంవో వెంకటేశ్వర్లు సిపిఎం నాయకత్వం సంప్రదించగా నాకు సంబంధం లేదు. నేను ఏ వినతిపత్రం తీసుకోను నేను రాను నాకు ఎవరేమైపోయిన నాకేమీ అవసరం లేదు అంటూ నిర్లక్ష్యంగా ఫోన్లో నిమిషాల తరబడి మాట్లాడడానికి సమయం కేటాయించుకోవడం చాలా దుర్మార్గంగా ఉందని అటువంటి అధికారిపై తక్షణమే రాష్ట్ర మంత్రి ఎన్ ఎమ్ డి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ, డిఎం అండ్ హెచ్ ఓ వెంకటరమణ విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గతంలో కూడా ఇలాగే స్పందించారని ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే ఆర్ఎంఓ వైఖరి పై ఆందోళన చేయాల్సి వస్తుందని, రోగుల పట్ల ఆసుపత్రిలో సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతున్న వారి పట్ల నిర్లక్ష్యంగా వహిస్తూ మాట్లాడుతున్న ఇటువంటి అధికారులపై చర్యలు తీసుకోకపోతే రాబోయే కాలంలో ప్రజలే తిరగబడతారని అన్నారు.

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ 'బెస్ట్ డ్రైవర్'చిలకల గోపాల్‌కు ఘన సన్మానం.

## 33 ఏళ్లుగా ప్రమాద రహిత సేవలు.



**ఆంధ్ర ప్రగతి సిరివెళ్ల ప్రతినిధి నవంబర్ 24:**
విధి నిర్వహణలో అంకితభావం, ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా పనిచేస్తున్న ఆర్టీసీ డ్రైవర్ చిలకల గోపాల్‌ను రోటరీ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామానికి చెందిన చిలకల గోపాల్, నంద్యాల ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గత 33 సంవత్సరాలుగా ఆయన ఎటువంటి ప్రమాదాలకు తావివ్వకుండా, అత్యంత జాగ్రత్తగా బస్సును నడుపుతూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. ఆయన పనితీరును గుర్తించిన నంద్యాల ఆర్టీసీ డిపో అధికారులు ఇటీవలే చిలకల గోపాల్‌ను 'బెస్ట్ డ్రైవర్' అవార్డుతో సత్కరించారు. ఈ నేపథ్యంలో ఆయన సేవలను అభినందిస్తూ రోటరీ క్లబ్ వారు చిలకల గోపాల్‌ను ప్రత్యేకంగా సన్మానించారు. చిలకల గోపాల్ గతంలో కూడా తన ఉత్తమ సేవలకు గాను ఆర్టీసీ డిఎం, రవాణా శాఖ జిల్లా అడిషనల్ ఎస్పీ, ట్రాఫిక్ సిఐ మరియు ఆర్టీవో చేతుల మీదుగా సన్మానాలు అందుకున్నారు. కోటపాడు గ్రామస్తులు సైతం గోపాల్‌ను మంచి సేవా తత్వం, మానవతా మూర్తిగా, గొప్ప వ్యక్తిత్వం కలిగిన మనిషిగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతన్నా.. మీ కోసం.. కార్యక్రమం.

**సీఎం రాసిన లేఖను రైతులకు అందజేస్తున్న ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని.**



**ఆంధ్ర ప్రగతి మహానంది, నవంబర్ 24:**
నేటి(సోమవారం) నుండి డిసెంబర్ 02 వరకు 'రైతన్న మీ కోసం' రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మహానంది మండలం సీతారామపురం గ్రామంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని, రైతును రాజు చేసేందుకు ఎన్డీఏ ప్రభుత్వం ఏం చేస్తుందో.. రాబోయే ఐదేళ్లలో ఏం చేయబోతుందో రైతులకు వివరిస్తూ.. నేను రైతు బిడ్డనే. ప్రతి రైతు కష్టం నాకు తెలుసు. మీతో కలిసి నడుస్తా. మీ సమస్యను పరిష్కరించేందుకు మీకు అండగా ఉంటా అని సీఎం రాసిన లేకను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు బుడ్డారెడ్డి శేఖర్ రెడ్డి, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్షా ఉద్యోగులకు హెచ్.ఆర్. పాలసీ, ఎం.టి.ఎస్ అమలు చేయాలనీ మంత్రి ఫరూక్ కి వినతిపత్రం.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 24:** ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్-జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా వేలాది మంది ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ కి నంద్యాల సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్-జేఏసీ తరపున వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ స్పందిస్తూ ఈ విషయాలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు కాంతారావు, ఉపాధ్యక్షుడు ఆదిశేషయ్య, ప్రధాన కార్యదర్శి శేఖర్, కార్యదర్శి పుల్లారెడ్డి, ఉర్దూ డిఐ అస్మద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

# మహానంది ఆలయానికి భద్రత పెంపు.

**ఆంధ్ర ప్రగతి మహానంది నవంబర్ 24:**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానంది ఆలయానికి భద్రత పెంచనున్నట్లు విశ్వాసనీయ సమాచారం. గతంలో మహానంది ఆలయానికి మూడు షిఫ్టుల్లో దాదాపు 8 నుండి 9 మంది హోంగార్డులు భద్రతా కారణాల దృష్ట్యా విధులు నిర్వహించేవారు. కోవిడ్ నుండి జరిగిన పరిణామాలతో అప్పటినుండి కేవలం ముగ్గురు మాత్రమే 3 షిఫ్టుల్లో విధులు నేటి వరకు నిర్వహిస్తున్నారు. నంద్యాల జిల్లా పోలీస్ బాస్ మహానంది ఆలయ భద్రతపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి క్రింది స్థాయి అధికారులకు భద్రతకు సంబంధించిన మెన్ వివరాలు సేకరించినట్లు తెలుస్తుంది. దీనికి తోడు మహానంది ఆలయ అధికారులు కూడా జిల్లా పోలీస్ బాస్ ను కలిసి అవసరమైన హోంగార్డుల సంఖ్య పెంచాలని కోరినట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగానే త్వరలోనే అవసరమైన సిబ్బందిని ఆలయ రక్షణ కోసం నియమించేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఆలయ అధికారులు కూడా ఈ విషయంపై త్వరలో హోమ్ గార్డుల సంఖ్య ఆలయ భద్రత దృష్ట్యా పెంచే అవకాశం ఉందని సంకేతాలు వెలువరించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అది కొద్ది రోజుల్లో ఆలయ భద్రతలో భాగంగా భద్రత సిబ్బందిని పెంచే అవకాశం ఉన్నట్లు సమాచారం. జిల్లా పోలీసు బాస్ కూడా ఆలయ భద్రతపై ఉపేక్షించడం సరికాదని త్వరలో భద్రత ఏర్పాట్లకు సంబంధించిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.



# నంద్యాల ఐఎంఏ కు పురస్కారాలు.

**రాజంపేటలో జరిగిన 67వ ఐఎంఏ రాష్ట్ర సదస్సులో జాతీయ ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ దిలీప్ బానుశాలి అందజేశారు.**

**నంద్యాల ఐఎంఏ కు ఉత్తమ శాఖ పురస్కారం.**

**ఉత్తమ అధ్యక్షుడిగా డాక్టర్ మధుసూదనరావు.**

**నంద్యాల ఐఎంఏ మహిళా విభాగానికి ఉత్తమ సామాజిక సేవల పురస్కారం.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 24:**
నంద్యాల ఐ.ఎం.ఏ. గత సంవత్సర కాలంలో చేసిన కార్యక్రమాలకు రాజంపేటలో జరిగిన 67వ ఆంధ్ర ప్రదేశ్ ఐఎంఏ రాష్ట్ర సదస్సులో ఐఎంఏ జాతీయ అధ్యక్షులు డాక్టర్ దిలీప్ బానుశాలి నాలుగు పురస్కారాలు అందజేశారు. మీడియం బ్రాంచ్ విభాగంలో నంద్యాల ఐఎంఏ కు ఉత్తమ శాఖ పురస్కారం, ఉత్తమ అధ్యక్షులుగా డాక్టర్ మధుసూదన రావు, ఉత్తమ సామాజిక సేవల పురస్కారం నంద్యాల ఐఎంఏ మహిళా విభాగానికి దక్కింది. ఐఎంఏ ప్రాంతీయ వైద్య వైజ్ఞానిక సదస్సు నంద్యాల ఐఎంఏ నిర్వహించినందుకు మరొక పురస్కారం అందజేశారు. ఈ పురస్కారాలను గత సంవత్సర కాలంగా నంద్యాల ఐఎంఏ అధ్యక్షులుగా పనిచేసిన డాక్టర్ మధుసూదనరావు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ సహదేవుడు,ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్,రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ హరిత,రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ వినోద్ కుమార్ లు కలిసి అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ ,డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ గత సంవత్సర కాలంలో నంద్యాల ఐఎంఏ ద్వారా సామాజిక సేవలు, నిరంతర వైద్య విద్యా సదస్సులు, విద్యార్థి అవగాహన సదస్సులు, కళాశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు మొత్తం 146 కార్యక్రమాలు నిర్వహించామని వాటికి రాష్ట్ర ఐ ఎం ఎ గుర్తించి ఈ పురస్కారాలకు అవార్డ్స్ కమిటీ ఎంపిక చేసిందని అన్నారు. భవిష్యత్తులో కూడా నంద్యాల ఐఎంఏ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఈ పురస్కారాలు అందుకున్న వారిని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి,నంద్యాల ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ మహమ్మద్ రఫీ, సీనియర్ సభ్యులు డాక్టర్ సహదేవుడు తదితరులు అభినందనలు తెలిపారు.



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 23 నవంబర్ 2025

## దస్తగిరి భాషా కు న్యాయం జరిగేంత వరకు మా పోరాటం ఆగదు- జేపీసీ నాయకులు



**ఆంధ్ర ప్రగతి రుద్రవరం నవంబర్ 24:**నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ సరఫరాను తొలగించిన రుద్రవరం మండలం నక్కలదిన్నె గ్రామానికి చెందిన లైన్మెన్ శివ మరియు మండల విద్యుత్ అధికారులు పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈరోజు ఆళ్లగడ్డ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బీరువాల భాష ప్రజా సంఘాల నాయకులు చంద్రశేఖర్ ,బజాన్ ,హుస్సేన్ భాషలతో కలిసి ఆళ్లగడ్డ డివిజన్ ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. డిఈఈ సుబ్రహ్మణ్యం అందుబాటులో లేకపోవడంతో బీరువాళ్ళ భాష ఆయనతో చరవాణిలో మాట్లాడారు రుద్రవరం మండలం నక్కల దీన్నే గ్రామంలో మైనార్టీ సోదరుడు దస్తగిరి భాష పై గ్రామంలోని కొంతమంది పెత్తందారులు దౌర్జన్యాలకు తగబడు తున్నారని వారికి వంత పాడుతూ అక్కడి స్థానిక విద్యుత్ ఉద్యోగులు దస్తగిరి భాషాపై అక్రమంగా విద్యుత్ సౌర్యం చేశాడంటూ అబండాలను మోపుతూ ఇలాంటి ముందస్తు నోటీసులను ఇవ్వకుండా విద్యుత్ సరఫరాను తొలగించటం వల్ల ఆ కుటుంబం గత మూడు రోజుల నుండి చీకట్లో మగ్గిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ దస్తగిరి భాష విద్యుత్ సౌర్యానికి పాల్పడితే అందుకు సంబంధించి ఆ కేసులో కోర్టులో తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటాడని డి ఈ ఈ కి తెలిపారు. విద్యుత్ తొలగించడంతో ఇబ్బందుల పాలవుతున్న ఆ కుటుంబానికి తక్షణమే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని బీరు వాళ్ల భాష డి ఈ ఈ ని కోరారు. అందుకు స్పందించిన డి ఈ ఈ సుబ్రహ్మణ్యం సానుకూలంగా స్పందించి విద్యుత్ సరఫరాను అందిస్తామని తెలిపారు.ఐ

## వసతి గృహాల నిర్మాణానికి కోటి 25 లక్షల విరాళం.



**ఆంధ్ర ప్రగతి మహానంది నవంబర్ 24** మహానంది క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం వసతి గృహాల నిర్మాణానికి ఒక కోటి 25 లక్షల రూపాయల విరాళాన్ని ఒక ఎన్నారై కుటుంబం ఇవ్వడానికి ముందుకు వచ్చింది. ఆలయ ఈవో నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆ ఎన్నారై కుటుంబానికి చెందిన వడ్లమూడి సరోజిని ఆమె భర్త వడ్లమూడి రమేష్ బాబు( యు ఎస్ ఏ) పేరున ఒప్పంద పత్రాలను హైదరాబాదులోని దాత స్వగృహంలో స్వీకరించారు. మహానంది క్షేత్రంలో నిర్మాణంలో ఉన్న నందీశ్వర సదనం మొదటి అంతస్తు నిర్మాణంలో భాగంగా విరాళ పత్రాలను అందజేసినట్లు ఈవో నల్ల కాల్వ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఎన్నారై కుటుంబానికి స్వామివారి తీర్థ ప్రసాదాలు మెమెంటో వారికి ఆలయ ఈవో నల్లకాలువ శ్రీనివాసరెడ్డి అందజేశారు. హైదరాబాద్ కు చెందిన మరో దాత కూడా దాదాపు రెండు కోట్ల రూపాయలు భక్తుల సౌకర్యార్థం వసతి గృహాలు/ కాటేజీల నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తుంది. మరికొందరు దాతలు భక్తుల సౌకర్యం వసతి గృహాల నిర్మాణానికి ముందుకు వస్తున్నట్లు ఆలయ వర్గాల బోగట్ట. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో మధు వేద పండితులు రవిశంకర్ అవధాని, సీనియర్ అసిస్టెంట్ జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భవతీ భిక్షాందేహి అని..

## జోల పట్టుకొని న్యాయం చేయమని వేడుకుంటున్న రైతు.

### కంది చేనుకు నిప్పంటించిన దుండగులు.



**ఆంధ్ర ప్రగతి నందికొట్కూరు నవంబర్ 24:**
నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం కొత్తపల్లి మండలం కొక్కెరంచ గ్రామంలో చెందిన ఒక రైతు ఆరెకరాల కంది సేను పంట చేయడం జరిగింది. ఆ రైతుకు పంట చేతికొచ్చే సమయంలో కొందరు సరిపోని వ్యక్తులు కంది సేను పంటను అగ్ని దహనం చేశారని అ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తపల్లి మండలం తాసిల్దారు అగ్రికల్చర్ ఏవో వీఆర్వోలు తలారులు సచివాలయం ఉద్యోగస్తులు కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పోలీసులు చుట్టూ తిరుగుతూ భవతీ భిక్షాందేహి అని రైతు జోలి పట్టుకొని న్యాయం కోసం పోరాడుతున్న చాప కింద నీరుల వ్యవహరిస్తున్నారని ఆ రైతు పురుగుల మందే నాకు శరణం అంటున్న ఒక పేద రైతు కుటుంబం. సీఎం చంద్రబాబు నాయకుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యవసాయ శాఖ మంత్రి,
నంద్యాల జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ.. తదితరులు ఒక పేద రైతు కుటుంబానికి న్యాయం చేయాలని సీఎంని డిప్యూటీ సీఎంని కలెక్టర్ ని ఎస్పీని దేవి బిచ్చందే అని జోలి పట్టుకొని న్యాయం అడుగుతున్న ఒక రైతు కిందిస్థాయి అధికారులు ఆ రైతుకు న్యాయం చేయలేదు. పై స్థాయి అధికారులు. న్యాయం చేయాలని ఆ రైతు కోరుచున్నాడు ఇది ఆ రైతు ఫోన్ నెంబర్.9346441261. జిల్లా రాజు



కలెక్టర్ జిల్లా శాంతి భద్రతల ఫ్రెండ్లీ పోలీస్ ఎస్పీ గారు ఇది ఇరువైపులా విచారించి ఎవరు దొంగలో తేల్చి ఆ రైతుకు న్యాయం చేయమని ప్రజల కోరుతున్నారు.

## కర్నూలు జిల్లా వారికి 30న తితిదే భగవద్గీత కంఠస్థ పఠన పోటీలు.

### తలరాతను మార్చేది భగవద్గీతే.

### : శ్రీశ్రీశ్రీ విరజానంద స్వామీజీ.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు నవంబర్ 24:**
గీతా జయంతి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహిస్తున్న భగవద్గీత కంఠస్థ పఠణ పోటీలలో భాగంగా ఈ సంవత్సరము కర్నూలు జిల్లాకు గాను ఈనెల 30వ తేదీ, ఆదివారం ఉదయం 9-00 గంటల నుండి కర్నూలునగరం, సి. క్యాంపులోని తి.తి.దే. కళ్యాణ మండపం నందు పోటీలు నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలుజిల్లా శాఖ కార్యనిర్వాకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను అచలానందాశ్రమం పీఠాధిపతులు పూజ్యపాద శ్రీశ్రీశ్రీ విరజానంద స్వామీజీచే కర్నూలు నగరంలోని తిరుమల తిరుపతి దేవస్థానములు కళ్యాణ మండపం నందు ఆవిష్కరించారు. విద్యార్థులకు బాల్యం నుండే భగవద్గీతను బాల్యంనందే నేర్పడం వల్ల విద్యార్థులలో నైతిక విలువలు పెరగడంతోపాటు, గొప్ప వ్యక్తిత్వ నిర్మాణం జరిగుతుందని స్వామీజీ అన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరు "ప్రతి ఇంటా భగవద్గీత - ప్రతి నోటా భగవద్గీత" అని సంకల్పించుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం పోటీల విధివిధానాలు మూడు విభాగాలుగా నిర్వహించనున్నారని, 6వ తరగతి నుండి 9వ తరగతి



విద్యార్థులకు 14వ అధ్యాయం గుణత్రయ విభాగయోగము మొత్తం 27 శ్లోకాలు.,10వ తరగతి మరియు ఇంటర్ విద్యార్ధులకు 16వ అధ్యాయము దైవాసుర సంపద్విభాగయోగము మొత్తము 24 శ్లోకాలు.,18 సంవత్సరాల నుండి 45 సంవత్సరాలలోపు వారికి "నిత్యజీవితంలో భగవద్గీత - భావ విశ్లేషణ" అనే అంశంపై ఈ పోటీలు కర్నూలు జిల్లాకు వారికి మాత్రమే నిర్వహించబడునని తెలిపారు. ప్రతి విభాగం నుండి విజేతలను గుర్తించి వారికి ప్రథమ బహుమతి రూ1116-00, ద్వితీయ బహుమతి రూ816-00, తృతీయ బహుమతి రూ516-00తోపాటు తితిదే నుడి ప్రశంసా పత్రము, జ్ఞాపికను బహూకరించబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోదా విష్ణు సహస్రనామ పారాయణ సంఘం అధ్యక్షులు మారం నాగరాజు గుప్తా,ధార్మిక సంస్థల ప్రతినిధులు తుమ్మేపల్లె శ్రీనివాసులు,ఆకుల జయకృష్ణ, ఎ. హరి, డి.వంశీ,కె. వేణుగోపాల్, నరహరి వెంకట రఘురామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనబోయే అభ్యర్థులందరూ ముందుగా తమ తమ పాఠశాలు, కళాశాలల నుండిగానీ, స్వయంగాగానీ విద్యార్థుల జాబితాను 9059802265 వాట్సాప్ నెంబర్ కు పంపవలెనని విజ్ఞప్తి చేశారు.

# వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం అండ.

### -రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్.

**" రైతన్నా - మీకోసం" పంచ సూత్రాలపై.. ఇంటింటికి తిరిగి రైతులకు అవగాహన కల్పించిన మంత్రి ఫరూక్.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల మండలం నవంబర్ 24:**
నంద్యాల మండలం, పోలూరు గ్రామంలో సోమవారం రోజున వ్యవసాయ శాఖ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో "రైతన్నా - మీకోసం" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ గ్రామంలోని రైతుల ఇంటింటికి స్వయంగా తిరిగి 'రైతన్నా-మీకోసం' పాంప్లెట్‌లను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు అండగా అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి, వాటి ప్రయోజనాల గురించి ఆయన రైతులను అడిగి



తెలుసుకుంటూ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ... "కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని . చంద్రన్న నాయకత్వంలో వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్నాం" అని తెలిపారు. 'రైతన్నా-మీకోసం' కార్యక్రమాన్ని ఈ నెల నవంబర్ 24 నుండి 29 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కావాలనే లక్ష్యంతో కూటమి సర్కార్ పంచ సూత్రాల విధానాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు.
రైతన్నా-మీకోసం పంచ సూత్రాలు
నీటి భద్రత డిమాండ్ ఆధారిత పంటలు అగ్రిటెక్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రభుత్వాల మద్దతు
ఈ పంచ సూత్రాల ద్వారా వ్యవసాయ రంగంలో పెనుమార్పులు తీసుకొచ్చి, అన్నదాతలకు అన్నివిధాలా అండగా ఉంటామని మంత్రి ఎన్ఎండి ఫరూక్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మండల టిడిపి కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి, పైరెడ్డి జోజీరెడ్డి, జయచంద్రరెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, అర్ఫాత్ బాషా, మోదీన్, మదర్ సా, వడ్ల అర్షద్ బాషా,చంద్ బాషా,పెద్ద గుండాలు,భూపాల్ రెడ్డి మరియు వ్యవసాయ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, ఇతర అనుబంధ శాఖల సిబ్బంది, స్థానిక నాయకులు, మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## మీకోసం రైతన్న వారోత్సవాలు ప్రారంభం.



**ఆంధ్ర ప్రగతి మహానంది నవంబర్ 24:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మీకోసం రైతన్న వారోత్సవాలు మహానంది మండలంలో మండల వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. మండలంలోని మసీదుపురం, సీతారామపురం తదితర గ్రామంలో ప్రతి రైతు కుటుంబం ఇంటికి తిరిగి ప్రతి రైతుకు ప్రభుత్వం అందజేస్తున్న సహాయ సహకారాలను వివరించారు. అన్నదాత సుఖీభవ/ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద రెండవ విడత రాష్ట్ర ప్రభుత్వం 5000 కేంద్రం వాట 2000 రూపాయలు రైతుల ఖాతాల్లో ఈనెల 21న జమ చేయడం జరిగిందని రైతులకు తెలిపారు. ప్రతి రైతు ఇంటికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సందేశం తో కూడిన ప్రభుత్వం విడుదల చేసిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించడంతోపాటు, రసాయనకేరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని సూచించారు. రైతుల నుంచి సేకరించిన సమాచారాన్ని ఉన్నత అధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదిక రూపంలో డిసెంబర్ 3వ తేదీన అందజేస్తామన్నారు .ఈ కార్యక్రమంలో గ్రామస్థాయి సిబ్బందితోపాటు మసీదుపురం గ్రామానికి చెందిన టిడిపి మండల క్లస్టర్ ఇంచార్జి చంద్రమౌళీశ్వర్ రెడ్డి, గ్రామ వ్యవసాయ శాఖ అధికారి భారతి ఇతర సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## 5 వేల అంగన్‌వాడీల ఉన్నతీకరణ

### సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

**పార్వతీపురం,నవంబరు 24ఆంధ్ర ప్రగతి** రాష్ట్రంలో 5వేలమినీ అంగన్వాడీలను అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ఏపీ మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. దీంతోపాటే మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 217 మందికి అంగన్వాడీ టీచర్లుగా పదోన్నతి కల్పిస్తున్నామని మంత్రి వెల్లడించారు. అంగన్వాడీ ఉద్యోగుల జీవితాల్లో ఆనందం నింపిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. బాల్యవివాహాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. పిల్లల పోషణ, ఆరోగ్యం, ప్రి స్కూల్ ఎడ్యుకేషన్ సేవలను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సంధ్యారాణి సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీ సేవలను మరింత విస్తృతం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తెలిపారు. చిన్నిపిల్లల ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ పెట్టాలన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ఎస్సీల ఎదుగుదలకు అడ్డంకిగా క్రిమీలేయర్ !

**నవంబరు 24ఆంధ్ర ప్రగతి**

ఎస్సీలలో క్రిమిలేయర్ విధానం అమలు చేయాలని ఇటీవల పదవీ విరమణ పొందేముందు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ చేసిన సూచన సమాజానికి ఓ హెచ్చరిక లాంటిది. రాజకీయ పార్టీలు దీనిపై చర్చించాలి. పార్లమెంట్ దీనిపై చర్చించాలి. ఎందుకంటే సామాజికంగా ఎస్సీలు అంతా అభ్యున్నతి చెందాలంటే ఇది అత్యావశ్యకం. అప్పుడే ఎస్సీలంతా ఉన్నతంగా ఎదుగుతారు. లేకుంటే రిజర్వేషన్లు ఎన్నేళ్లు పెట్టినా కొందరే తన్నుకుపోతారు. ఇది అమలు కాకపోవడం వల్ల కేవలం కొందరే రిజర్వేషన్ల లబ్దిని పొందుతున్నారు. దీంతో గత 75 ఏళ్లుగా కొందరే ఉద్యోగ, రాజకీయ లబ్ది పొందుతూ వస్తున్నారు. వారి కుటుంబాలే సమాజాంలో వెలుగొందుతున్నాయి. పదవీ విరమణ పొందిన జస్టిస్ గవాయ్ దీనిని గట్టిగా సూచించి ఉంటే బాగుండేది. కేంద్రం కూడా ఎందుకో ఈ విషయంలో పట్టించుకోవడం లేదు. నిజానికి రిజర్వేషన్లను కొంతకాలం వరకే అమలు చేయాలి. ఒక కుటుంబం రిజర్వేషన్ల పొందిన తరవాత వారు ఉన్నతస్థానం చేరుకున్నాక వారిని క్రిమిలేయర్‌గా గుర్తించి, వారిని దూరం పెట్టాలి. ఉద్యోగాల్లో అయినా రాజకీయాల్లో అయినా ఇది చేసితీరాలి. ఇది లేకపోవడం వల్ల ఒకే కుటుంబానికి చెందిన వారు వారసత్వం గా రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నారు. వెనకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతులు, తెగల వారి మధ్యలో రాజ్యం ద్వారా ఈ రిజర్వేషన్ల విధానం సమానత్వం, ఏకరూప అభివృద్ధి సాధించ వలసి వుంది. ఇందుకు బదులుగా, రిజర్వేషన్లు పొందిన కొన్ని కులాలు, కుటుంబాలే మళ్లీ మళ్లీ పొందుతూ అసమానతలను, వెనకబడిన వారి మధ్య మరింత వెనకబడిన పరిస్థితులను సృష్టించాయి. రిజర్వేషన్ల అమలు విధానాల ప్రభావాలను సమీక్ష చెయ్యడంలో ఆయా ప్రభుత్వాలు అనుసరించిన అలక్ష్యం, అలసత్వాలు ఈ ఆంతరిక వ్యత్యాసాల పెరుగుదలకు ఉపకరించాయి. హోదాలు, జీతభత్యాలతో సహా, అన్ని రకాల సంపద అవకాశాలూ ప్రతి ఒక్కరికీ పంచాలని రాజ్యాంగం నిర్దేశించిన సంగతిని ఈ విద్యావంతులైన సంపన్నశ్రేణి మరువరాదు. సాంకేతిక అంశాలను, సమాజాన్ని గందరగోళంలోకి నెట్టే తప్పుడు వాదనలను, భయాలను, స్వార్థపూరిత దుష్ప్రచారాలను కొనసాగించవద్దు. ప్రతి కులానికీ, జాతికీ, తెగకూ రిజర్వేషన్లలో పంపిణీ న్యాయం జరగటానికి వీలుగా, ఉపవర్గీకరణ చేసి, హేతుబద్ధీకరించాలని నలభైఏళ్లపాటు దండోరా ఉద్యమం జరిగింది. వర్గీకరణ వ్యతిరేకవాదులు ఆటంకాలు కల్పించి, చివరకు ఓడిపోయారు. ఇలా జరక్కుండా, అత్యంత వెనకబడిన అణగారిన కుటుంబాలకు, సమూహాలకు ప్రాధాన్యతలతో కూడిన ప్రాతినిధ్య న్యాయం కల్పించడానికి ఇప్పుడు సంపన్న శ్రేణిలో చేరినవారు ప్రగతిశీల దృక్పథంతో క్రీమిలేయర్ అమలును స్వాగతించాలి. అగ్రకులాల వారిని విమర్శిస్తున్న వారు ఈ క్రిమిలేయర్ గురించి మాట్లాడడం లేదు. ముఖ్యంగా దళితుల్లో చైతన్యం రావాలి. వారే రిజర్వేషన్ను క్రమబద్ధీకరించే విషయంలో పోరాడాలి. అప్పుడే అస్సు రిజర్వేషన్లు పొందని వారికి న్యాయం జరగగలదు. ఉదాహరణకు ఒకటుంబం తరాలుగా రిజర్వేషన్లను





అనుభవిస్తోంది. వారు ఉన్నత స్థానానికి ఎదిగారు. పారిశ్రామిక వేత్తులుగా రాణిస్తున్నారు. ఇలా అనేకులు ముందు ఉన్నారు. కేవలం వీరిని ఉదాహరణగా చూపడం తప్ప వీరిగురించి వేరే ఉద్దేశ్యంతో కాదు. పన్న శ్రేణి అంటే క్రీమిలేయర్ విధానం ఎస్సీలలో ప్రవేశపెట్టడం అత్యంతావశ్యకం. జస్టిస్ గవాయ్ చేసిన సూచన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చ కావాలి. ఎస్సీల్లో ఉపకులాల రిజర్వేషన్ల కోసం ఉద్యమించినట్లుగానే క్రిమిలేయర్ కోసం కూడా దళితులే ఉద్యమించాలి. ఈ డిమాండ్ చాలాకాలంగా ఉంది. అయితే విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల ద్వారా అత్యధికంగా లబ్దిపొందిన ఎస్సీలు దీనిని వ్యతిరేకిస్తున్నారు. ఇది సరికాదు. ఎస్సీ వర్గీకరణ అనుకూల ఎస్సీ మేధావులు దీనిపై చర్చించాలి. ఈ సంపన్నశ్రేణి విధానం దగ్గరికి వచ్చేసరికి, ప్రగతి నిరోధకంగా వ్యవహరిం చడం సరికాదు. ఆధిపత్య కులాల వారి సంపదలకు ఏ విధమైన పరిమితులూ విధించనప్పుడు, తమకు మాత్రం ఈ సంపన్న శ్రేణి విధానం వర్తింపజేయాలని కోర్టులు, ప్రభుత్వాలు ఆలోచించడం అన్యాయం అని కొందరు వాదిస్తున్నారు. అయితే ఇక్కడ ఎస్సీలది సమస్య ఆర్థిక సమస్య కాదు, సామాజిక సమస్య. రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందాల్సిన తరుణంలో కొందరే అనుభవించడం సరికాదు. ఎస్సీల్లో కొందరు మాత్రమే రిజర్వేషన్ల ఫలాలు పొంది ఆర్థికంగా బాగుపడినప్పటికీ, కులపరంగా మిగతా వారు వేదనకు గురవుతున్నారు. ఇదో రకంగా ఎస్సీల్లో దొరతనానికి పరాకష్టగా చూడాలి. ఎస్సీలో కొందరు పెద్ద దొరలు తయారవుతున్నారు. రిజర్వేషన్ల ఫలాలతో ఎదిగిన ఈ వర్గాల్లో చాలామంది అభివృద్ధి చెందిన ఇతర కులాలతో అంటకాగుతూ, తమ వర్గాలను విస్మరిస్తున్నారు. ఈ కారణంగా 90శాతం మిగతా ఎస్సీల్లో ఇప్పటికీ ఆధిపత్య కులాల సంపన్నులతో పోటీపడలేకపోతున్నారు. రిజర్వేషన్ల ద్వారా లబ్దిపొందిన వారే మళ్లీ మళ్లీ అవకాశాలు అందుకుంటూ తమ వారికి అడ్డుగా మారుతున్నారు. డబ్బు సంపాదనలో ముందున్న కొందరు తమ వర్గంలోని మిగతావారిని పైకి తీసుకుని రాలేకపోతున్నారు. సంపన్నశ్రేణిని గుర్తించి సరిచేయడం ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం చూపగలం. అలాగే రిజర్వేషన్లు ఎల్లకాలం అనుభవించే హక్కునుంచి వీరిని దూరం చేయాల్సింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ ఓ కార్యక్రమంలో మాట్లాడుస్తూ రిజర్వేషన్ల దగ్గరికి వచ్చినపుడు ఒక ఐఏఎస్ అధికారి సంతతిని, ఒక పేద వ్యవసాయ కూలీ సంతతిని సమానంగా చూడరాదని అన్నారు. ఇది వాస్తవం. నిజానికి రిజర్వేషన్ల నిచ్చెనలు ఎక్కిన ఎందరో మిగతా ఎస్సీల అభ్యున్నతికి పాటుపడుతున్న దాఖలాలు లేవు. అందువల్ల క్రీమిలేయర్ విధానం అమలు జరగాలి. ఒక కుటుంబానికి ఒకటి రెండుసార్లే రిజర్వేషన్లు అమలు కావాలి. అప్పుడే ఎస్సీలు సామాజికంగా ఎదుగగలరు.

---

# ధర్మేంద్ర మృతికి పలువురు సంతాపం

**సంతాపం తెలిపిన రాష్ట్రపతి, ప్రధానమంత్రి -శ్మశానవాటికలో నివాళి అర్పించిన సినీ దిగ్గజాలు**

ముంబై,**నవంబరు 24ఆంధ్ర ప్రగతి** : సోమవారం ధర్మేంద్ర ఆరోగ్యం విషమించడంతో ఆయన కన్నుమూశారు.. సినీ ప్రముఖులు ఆయనకు నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని సోషల్ మీడియా వేదికగా గుర్తుచేసుకున్నారు. ధర్మేంద్ర పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో స్థానిక విల్లే పార్లీ శ్మశాన వాటికకు తరలించారు. ధర్మేంద్ర కన్నుమూశారన్న సమాచారం తెలుసుకున్న సినీ, రాజకీయ ప్రముఖులు ఆయన భౌతిక కాయాన్ని కడసారి చూసేందుకు శ్మశాన వాటికకే తరలివచ్చి, నివాళులర్పించారు. ధర్మేంద్ర మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు. 'భారతీయ సినిమాలో ఒక శకం ముగిసింది. తన నటనతో అనేక పాత్రలకు వన్నె తెచ్చారు. ఇది ఎంతో విచారకరమైన సమయం. ధర్మేంద్ర కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. చిత్ర పరిశ్రమకు తీరని లోటు ' అని రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ధర్మేంద్ర మృతిపట్ల దర్శక, నిర్మాత కరణ్‌జోహార్ కూడా విచారం వ్యక్తం చేశారు. ఒక శకం ముగిసిందన్నారు. 'మెగాస్టార్, గొప్ప అందగాడు, ఇండియన్ సినిమా లెజెండ్ వన్ అండ్ ఓన్లీ ధర్మేంద్రజీ మిమ్మల్ని ఎంతో మిస్ అవుతున్నాం' అని పేర్కొన్నారు.ధర్మేంద్ర 1935 డిసెంబరు 8న జన్మించారు. ఆయన పూర్తి పేరు ధర్మేంద్ర కెవల్ క్రిషన్ దేవోల్. 1954లో ప్రకాశ్‌కౌర్‌ను వివాహం చేసుకున్నారు.





1980లో బాలీవుడ్ సీనియర్ నటి హేమమాలినిని రెండో వివాహం చేసుకున్నారు. ధర్మేంద్రకు సన్నీ, బాబీ, ఈషా సహా ఆరుగురు సంతానం. బాలీవుడ్ హీ-మ్యాన్‌గా పేరుతెచ్చుకున్న ఆయన నటనకు అనేక అవార్డులు వచ్చాయి. చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన సేవలకు గానూ కేంద్ర ప్రభుత్వం 2012లో పద్మభూషణ్‌తో సత్కరించింది. ధర్మేంద్ర రాజకీయాల్లోనూ రాణించారు. 2004లో బికనీర్ నుంచి భాజపా ఎంపీగా గెలుపొందారు. 1960లో 'దిల్ బీ తేరా హమ్ బీ తేరే'తో నటుడిగా కెరీర్‌ను ఆరంభించిన ఆయన 'అన్‌పఢ్ ', 'బందినీ', 'అనుపమ', 'ఆయా సావన్ జూమ్ కే' తదితర చిత్రాలతో నటుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'షోలే', 'ధర్మవీర్', 'చుప్కే చుప్కే', 'మేరా గావ్ మేరా దేశ్', 'డ్రీమ్ గర్ల్' వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని నమోదు చేశాయి. ధర్మేంద్ర కెరీర్‌లో దాదాపు 300లకు పైగా చిత్రాల్లో నటించారు. చివరిగా షాహిద్ కపూర్, కృతి సనన్‌ల 'తేరీ బాతోమే ఐసా ఉల్జా జియా' చిత్రంలో వెండితెరపై కనిపించారు.

# భారత్ అమ్ములపొదిలో 'నిశ్శబ్ద వేటగాడు'

**-భారత నౌకాదళంలోకి చేరిన కొత్త తరం యుద్ధ నౌక ఐఎన్ఎస్ మాహె**

**జలాంతర్గాములను వేటాడటమే దీని ప్రధాన లక్ష్యం**

**80 శాతానికి పైగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మాణం**

**లోతు తక్కువ నీటిలోనూ పనిచేయగల ప్రత్యేక సామర్థ్యం**

**ఈ తరహాలో రానున్న 8 నౌకల్లో ఇది మొదటిది**

న్యూఢిల్లీ,**నవంబరు 24ఆంధ్ర ప్రగతి**

భారత నౌకాదళం తన అమ్ములపొదిలో మరో శక్తిమంతమైన ఆయుధాన్ని చేర్చుకుంది. తీర ప్రాంతాల్లో శత్రు జలాంతర్గాములను గుర్తించి, వాటిని ధ్వంసం చేయడమే లక్ష్యంగా రూపొందించిన 'మాహె' శ్రేణిలోని తొలి యుద్ధ నౌక ఐఎన్ఎస్ మాహెను నేడు లాంఛనంగా ప్రారంభించింది. అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఈ యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో-వాటర్ క్రాఫ్ట్ (%యూౕ-ాౕజ%) రాకతో భారత తీర రక్షణ సామర్థ్యం, జలాంతర్గాములను వేటాడే శక్తి గణనీయంగా పెరగనుంది. దీనిని దేశీయంగా నిర్మించిన సరికొత్త తరం తీరప్రాంత యుద్ధ నౌకగా నేవీ అభివర్ణించింది.

ఈ యుద్ధ నౌక నిర్మాణం 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తికి నిలువుటద్దం పడుతోంది. ఇందులో 80 శాతానికి పైగా స్వదేశీ పరికరాలు, సాంకేతికతను వినియోగించారు.



కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (%జూౕ%) దీన్ని నిర్మించింది. ఈ ప్రాజెక్టు.. నౌకా నిర్మాణ రంగంలో భారత్ సాధించిన ప్రగతికి, వ్యవస్థల అనుసంధానంలో మనకున్న నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. తీరానికి సమీపంలో ఉండే జలాల్లో వేగంగా, శత్రువుల కంటపడకుండా, అత్యంత కచ్చితత్వంతో కార్యకలాపాలు నిర్వహించేలా దీనిని ప్రత్యేకంగా డిజైన్ చేశారు.


ఐఎన్ఎస్ మాహెను ప్రధానంగా తీర ప్రాంతాల్లోని లోతు తక్కువ నీటిలో ఆపరేషన్ల కోసం రూపొందించారు. పెద్ద యుద్ధ నౌకలు వెళ్లలేని ఇరుకైన జలాల్లో ఇది సులువుగా కదలగలదు. యాంటీ-సబ్‌మెరైన్ ఆపరేషన్లతో పాటు, తీరప్రాంత గస్తీ, సముద్ర గర్భంలో మైన్‌లను అమర్చడం, నీటి అడుగున నిఘా వంటి కీలక బాధ్యతలను ఇది సమర్థంగా నిర్వర్తిస్తుంది. దీని పొడవు 78 మీటర్లు కాగా, సుమారు 1,100 టన్నుల బరువును మోయగలదు. గంటకు 25 నాట్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించే ఈ నౌక, ఒకసారి ఇంధనం నింపుకుంటే 1,800 నాటికల్ మైళ్ల దూరం ప్రయాణించి, 14 రోజుల పాటు నిరంతరాయంగా విధుల్లో పాల్గొనగలదు. దాదాపు నిశ్శబ్దంగా ప్రయాణించే దీన్ని 'సైలెంట్ హంటర్' గా పిలుస్తారు.ఈ నౌకలో అత్యాధునిక స్వదేశీ ఆయుధ వ్యవస్థలను అమర్చారు. ఇంటిగ్రేటెడ్ కంబాట్ మేనేజ్‌మెంట్ సూట్, డీజిల్ ప్రొపల్షన్, అడ్వాన్స్‌డ్ పవర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, మీడియం-ఫ్రీక్వెన్సీ సోనార్, మల్టీ-ఫంక్షన్ సర్వైలెన్స్ రాడార్ వంటివి ఇందులో ఉన్నాయి. తేలికపాటి టార్పెడోలు, మల్టీ-రోల్ రాకెట్ లాంచర్లు, స్వీయ రక్షణ కోసం రిమోట్ కంట్రోల్డ్ 30 ఎంఎం గన్‌తో పాటు, మైన్‌లను అమర్చేందుకు ప్రత్యేక రైళ్లను కూడా అమర్చారు.మలబార్ తీరంలోని చారిత్రక పట్టణమైన మాహె పేరును ఈ నౌకకు పెట్టారు. దీని చిహ్నంపై కలరిపయట్టు యుద్ధ విద్యలో ఉపయోగించే 'ఉరుమి' అనే వంగే కత్తి చిత్రాన్ని ముద్రించారు. ఇది చురుకుదనాన్ని, కచ్చితత్వాన్ని, ప్రాణాంతకమైన సామర్థ్యాన్ని సూచిస్తుంది. ఈ నౌక లక్షణాలు కూడా అవేనని నేవీ అధికారులు తెలిపారు. కొచ్చిన్ షిప్‌యార్డ్ నుంచి నౌకాదళం ఆర్డర్ చేసిన ఎనిమిది నౌకల్లో ఇది మొదటిది. మిగిలిన ఏడు నౌకలు 2027 నాటికి నేవీలో చేరనున్నాయి. ఈ శ్రేణి నౌకలు పూర్తిస్థాయిలో విధుల్లోకి చేరాక, పాతబడిన అభయ్-క్లాస్ కార్వెట్‌ల స్థానాన్ని భర్తీ చేస్తాయి. తద్వారా హిందూ మహాసముద్ర ప్రాంతంలో, వ్యూహాత్మక తీర మండలాల్లో పనిచేసే శత్రు జలాంతర్గాములను గుర్తించి, నాశనం చేసే భారత సామర్థ్యం మరింత బలోపేతం కానుంది.

# మరోమారు కుత్సిత బుద్ధిని చాటుకున్న చైనా

**అరుణాచల్ యువతికి చైనాలో అవమానం**

**పాస్‌పోర్ట్ ఉన్నా..చెల్లదని వేధింపులు**

న్యూఢిల్లీ,**నవంబరు 24ఆంధ్ర ప్రగతి**



చైనా మరోమారు తన కుత్సిత బుద్ధిని చాటుకుంది. అరుణాచల్ తమదే అన్న వాదన కోసం ఏ చిన్న అవకాశం దొరికినా వదలడం లేదు. తాజాగా ఇలాంటి ఘటన కలకలం రేపింది.చైనాలో షాంఘై పుడాంగ్ విమానాశ్రయంలో భారత మహిళకు వేధింపులు ఎదురయ్యాయి. అరుణాచల్ ప్రదేశ్ చైనాదే అంటూ తన భారత పాస్‌పోర్ట్‌ను గుర్తించేందుకు ఆ దేశ అధికారులు నిరాకరించారని ఆమె ఆరోపించారు. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈనెల 21న పెమా వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ అనే మహిళ లండన్ నుంచి జపాన్‌కు వెళ్లే విమానం ఎక్కారు. అయితే ట్రాన్సిట్ హాల్ట్ కోసం అది చైనా నగరం షాంఘైలో దిగింది. అక్కడ తన పాస్‌పోర్ట్‌ను అధికారులు తనిఖీ చేశారని ఆమె చెప్పారు. అందులో తాను పుట్టిన రాష్ట్రం పేరు అరుణాచల్ ప్రదేశ్ అని ఉందని వెల్లడించారు. అది చూసిన తర్వాత ఇమిగ్రేషన్ అధికారులు తన పాస్‌పోర్ట్ చెల్లదని ప్రకటించారని ఆమె ఆరోపించారు. వారు ఆ ఈశాన్య రాష్ట్రాన్ని చైనాలో భాగమని పట్టుబట్టారన్నారు. ఇమిగ్రేషన్ అధికారులు, చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ సిబ్బంది తనవైపు చూసి నవ్వారని, చైనీస్ పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేసుకోమని హేళన చేశారని ఆమె వాపోయారు. చెల్లుబాటు అయ్యే వీసా ఉన్నా కూడా తన పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకున్నారని, జపాన్ వెళ్లే విమానం ఎక్కనివ్వలేదని మీడియాకు వెల్లడించారు. తనను ట్రాన్సిట్ ఏరియాకే పరిమితం చేశారని, మళ్లీ టికెట్లు బుక్ చేసుకోనివ్వలేదని, చివరకు ఆహారం కొనేందుకు కూడా అంగీకరించలేదన్నారు. యూకేలోని ఫ్రెండ్ ద్వారా షాంఘైలోని భారత దౌత్య కార్యాలయాన్ని సంప్రదించిన తర్వాతే తనకు సహాయం అందిందని పేర్కొన్నారు. భారత అధికారుల సహాయంతోనే తాను అక్కడి నుంచి బయట పడినట్లు చెప్పారు. అలాగే దీనిపై తాను ప్రధాని మోదీకి, ఇతర సీనియర్ అధికారులకు లేఖ రాసినట్లు చెప్పారు. ఇదంతా భారత సార్వభౌమత్వాన్ని, అరుణాచల్ ప్రదేశ్ ప్రజలను అవమానించడమేనని ఆ లేఖలో అభివర్ణించారు. ఈ పెమా వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ ప్రస్తుతం యూకేలో నివసిస్తున్నారు.ఈ వ్యవహారంపై అధికారికంగా ఎలాంటి స్పందనా రాలేదు.

-------------

# రూపాయి పతనంపై మండిపడ్డ కాంగ్రెస్

**ఆనాటి విమర్శల వీడియోను పోస్ట్ చేసిన జైరామ్**

న్యూఢిల్లీ,**నవంబరు 24ఆంధ్ర ప్రగతి**



అమెరికా డాలర్‌తో పోలిస్తే.. రూపాయి విలువ దారుణంగా పడిపోతుంది. శుక్రవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 89 రూపాయలకి పడిపోయింది. రూపాయి విలువ రికార్డు స్థాయిలో అత్యంత కనిష్ట స్థాయికి పడిపోవడంతో కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు చేసింది. 2013 యుపిఎ హయాంలో రూపాయి విలువ పడిపోవడంతో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మోడీ తీవ్ర విమర్శలు చేశారు. ఇప్పుడు ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో రూపాయి విలువ దారుణంగా పడిపోవడంతో కాంగ్రెస్ కూడా మోడీపై మండిపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ నిరంతరం పతనం అవుతూనే ఉంది. ఇప్పుడు అది 90 రూపాయల కనిష్ట స్థాయిని దాటబోతోంది. 2013 జూలైలో తాను చెప్పింది ప్రధానికి గుర్తుందా అని అప్పుడు మోడీ అన్న వీడియోను సోమవారం ఎక్స్ వేదికగా కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ పోస్టు చేశారు. రూపాయి ఎంత వేగంగా పతనమవుతుందో చూడండి. కొన్నిసార్లు రూపాయి, ఢిల్లీలో ప్రభుత్వానికి మధ్య పోటీ జరుగుతున్నట్లు అనిపిస్తుంది. అయితే రూపాయి పతనంపై దురుద్దేశపూరిత వ్యాఖ్యలు చేసినా.. అలా అన్న వారి గౌరవం కూడా వేగంగా దిగజారిపోతుంది అని జైరాం రమేశ్ ఈ వీడియోకు జతగా పోస్టు చేశారు.022 ఫిబ్రవరి 24వ తేదీన రూపాయి విలువ 99 రూపాయలకి పడిపోయింది. గత మూడు సంవత్సరాలుగా అత్యంత కనిష్ట స్థాయిలోనే రూపాయి విలువ పడిపోతుంది.

# గువాహటి టెస్టుపై సౌతాఫ్రికా పట్టు




**ఘోర పరాజయం దిశగా టీమిండియా**

**పెవిలియన్‌కు క్యూ కట్టిన భారత బ్యాటర్లు**

**201 పరుగులకే ఆలౌటైన భారత్**

**మార్కో యాన్సెన్ 6 వికెట్లతో విజృంభణ**

**సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 26/0**

గువాహటి వేదికగా భారత్‌తో జరుగుతున్న టెస్టులో సౌతాఫ్రికా పట్టుబిగించింది. ఆల్‌రౌండ్ షోతో భారీ ఆధిక్యం దిశగా సాగిపోతుంది. మూడో రోజు ఆట ముగిసేసరికి సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 26/0 స్కోరుతో నిలిచింది. క్రీజులో రికెల్‌టన్ (13), మార్‌క్రమ్ (12) ఉన్నారు. దీంతో ప్రస్తుతం సౌతాఫ్రికా 314 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. బుమ్రా వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో మార్‌క్రమ్‌కు లైఫ్ వచ్చింది. అతడు ఇచ్చిన కాస్త కష్టతరమైన క్యాచ్‌ను, సెకండ్ స్లిప్‌లో ఉన్న కేఎల్ రాహుల్ అందుకోవడానికి బాగానే ప్రయత్నించినా విఫలమయ్యాడు. అంతకుముందు 9- 0 స్కోర్‌తో మూడో రోజు ఆట ప్రారంభించిన టీమ్ఇండియా 201 పరుగులకే కుప్పకూలింది. సౌతాఫ్రికా పేసర్ మార్కో యాన్సెన్ 6 వికెట్లతో విజృంభించాడు. భారత్ టాప్ ఏడుగురు బ్యాటర్లలో ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (58 పరుగులుబీ 97 బంతుల్లో 7%ఇ4, 1ఇ%6) ఒక్కడే రాణించాడు. మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో ఒక దశలో 95/1తో మెరుగైన స్థితిలోనే కనిపించింది. కానీ ఆ తర్వాతే ఆట పూర్తిగా మారిపోయింది. టీమ్ఇండియా టపటపా వికెట్లు చేజార్చుకొని 122- 7తో పీకల్లోతు కష్టాల్లో పడింది. కేఎల్ రాహుల్ (22 పరుగులు), సాయి సుదర్శన్ (15 పరుగులు) విఫలమయ్యారు. ధ్రువ్ జురెల్ డకౌట్ కాగా (0), రిషభ్ పంత్ (7 పరుగులు), రవీంద్ర జడేజా (6 పరుగులు), నితీశ్ కుమార్ రెడ్డి (10 పరుగులు) ఘోరంగా విఫలమయ్యారు. చివర్లో వాషింగ్టన్ సుందర్ (48 పరుగులుబీ 92 బంతుల్లో 2%ఇ4, 1ఇ%6), కుల్దీప్ యాదవ్ (19 పరుగులుబీ 134 బంతుల్లో) పోరాడారు. ఈ జోడీ ఎనిమిదో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. దీంతో భారత్ స్కోర్ 200o దాటగలిగింది. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో యాన్సెన్ 6 వికెట్లతో భారత్‌ను దెబ్బకొట్టగా, సైమన్ హర్మర్ 3, కేశవ్ మహరాజ్ ఒక వికెట్ తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రితా తొలుత 489 పరుగుల భారీ స్కోర్ చేయగా, భారత్ 201 పరుగులకే ఆలౌటైంది. రూల్స్ ప్రకారం భారత్ ఫాలో ఆన్ తప్పించుకోవాలంటే 290 పరుగులు చేయాల్సి ఉంది. కానీ, 201 పరుగులకే కుప్పకూలింది. దీంతో భారత్ ఫాలో ఆన్ ఆడాల్సి ఉంది. కానీ, 288 పరుగులు వెనుకంలో ఉన్న భారత్‌ను ఫాలోఆన్ ఆడించడానికి అవకాశం ఉన్నా సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్ ఆడటానికే మొగ్గుచూపింది. బ్యాటింగ్‌లో ఔటాఫ్ సిలబస్‌లా దూసుకొచ్చి దుమ్మురేపిన మార్కో జాన్సెన్.. బౌలింగ్‌లోనూ నాలుగు వికెట్లతో భారత్ పతనాన్ని శాసించాడు. అతనికి తోడు సిమన్ హర్మర్ రెండు వికెట్లతో చెలరేగాడు. దాంతో టీమిండియాకు కోలుకోలేని దెబ్బపడింది. ఇన్నింగ్స్ తేడాతో ఘోరపరాజయాన్ని మూటగట్టుకునే దిశగా భారత్ సాగుతోంది. రెండో ఇన్నింగ్స్‌లో అద్భుతం చేసి రెండు రోజుల పాటు బ్యాటింగ్ చేస్తే తప్పా ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమి నుంచి గట్టెక్కే అవకాశాలు లేవు. ఈ మ్యాచ్‌లో ఓడినా.. డ్రా చేసుకున్నా సిరీస్ 1-0తో సౌతాఫ్రికా కైవసం అవుతుంది. తొలి మ్యాచ్‌లో భారత్ 30 పరుగుల తేడాతో ఓటమిపాలైన సంగతి తెలిసిందే. అదే జరిగితే గౌతమ్ గంభీర్ కోచింగ్ కెరీర్‌లోనే ఈ పరాజయం ఓ మాయని మచ్చగా మిగిలిపోతుంది. ఇప్పటికే న్యూజిలాండ్‌తో సొంతగడ్డపై 0-3తో క్లీన్ స్వీప్ అయిన భారత్.. మరో ఘోర పరాజయాన్ని ఖాతాలో వేసుకుంటుంది. ఈ ఓటమితో డబ్ల్యూటీసీ ఫైనల్ చేరే అవకాశాలు కూడా సన్నగిల్లుతాయి.

## స్మృతి పెళ్లి వాయిదా!

టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన పెళ్లి పెటాకులు అయిందా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఆదివారం బెంగళూరు వేదికగా జరగాల్సిన పెళ్లి మంధాన తండ్రి అనారోగ్యంతో వాయిదా పడిన సంగతి తెలిసిందే. వివాహ వేడుకల్లో శ్రీనివాస్ మంధాన చాతి నొప్పికి గురవ్వడంతో అతన్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించి పెళ్లిని వాయిదా వేసారు.అంతేకాకుండా స్మృతి మంధాన కాబోయే భర్త పలాష్ ముచ్చల్ కూడా అస్వస్థతకు గురైనట్లు వార్తలు వచ్చాయి. అయితే తాజాగా మంధాన సోషల్ మీడియా ఖాతాల్లో పెళ్లికి సంబంధించిన వీడియోలను తొలగించడం చర్చనీయాంశమైంది. పెళ్లికి ముందు పలాష్ ముచ్చల్ ప్రపోజ్ చేసిన వీడియోతో పాటు సహచర క్రికెటర్లతో కలిసి చేసిన రీల్స్‌ను కూడా మంధాన తొలగించింది.ముఖ్యంగా తమ ఎంగేజ్‌మెంట్‌ను ధ్రువీకరిస్తూ ఇటీవల స్మృతి మంధాన తన ఇన్‌స్టాలో ఓ వీడియోను షేర్ చేసింది. సహచర క్రికెటర్లతో కలిసి 'సమజ్ హెూ హై గయా' బాలీవుడ్ సాంగ్‌కు స్మృతి మంధాన డ్యాన్స్ చేసింది. ఈ సందర్భంగా తన వేలికి ఉన్న ఎంగేజ్‌మెంట్ రింగ్ చూపించింది. ఇదే వీడియోను స్మృతి సహచర ప్లేయర్స్ జెమీమా, శ్రేయాంక పాటిల్ కూడా సోషల్ మీడియాలో షేర్ చేశారు. తాజాగా వారు కూడా ఈ వీడియోను తొలగించడం అనేక సందేహాలకు తావిస్తోంది. అయితే ఈ వీడియోలను స్మృతి మంధాన డిలీట్ చేసిందా హైడ్ చేసిందా అన్నదానిపై క్లారిటీ లేదు. భారత మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచిన నవీ ముంబై మైదానంలో పలాశ్ ముచ్చల్ ప్రపోజ్ చేసిన సంగతి తెలిసిందే. మంధాన ఖాతాలో పెళ్లికి సంబంధించిన వీడియోలు మాయమవడంతో అనేక ఊహగానాలు మొదలయ్యాయి. స్మృతి పెళ్లి పెటాకులు అయ్యిందా అనే ప్రచారం మొదలైంది. పెళ్లికి ఆటంకాలు ఎదురవ్వడంతో ఇరు కుటుంబాల మధ్య వివాదాలు తలెత్తాయా ఈ ఆటంకాలను హెచ్చరికగా భావించి పెళ్లిని వాయిదా వేసుకున్నారా అనే చర్చ జరుగుతోంది.

# వరల్డ్ కప్ గెలిచిన భారత మహిళల కబడ్డీ జట్టు...

### సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ అభినందనలు

**వరుసగా రెండోసారి విశ్వవిజేతగా నిలిచిన మన అమ్మాయిలు**

**ఫైనల్లో చైనీస్ తైపీపై 35-28 తేడాతో ఘనవిజయం**




భారత మహిళల కబడ్డీ జట్టు మరోసారి విశ్వవిజేతగా నిలిచింది. ఢాకా వేదికగా జరిగిన మహిళల కబడ్డీ ప్రపంచకప్ ఫైనల్లో చైనీస్ తైపీ జట్టును ఓడించి వరుసగా రెండోసారి టైటిల్‌ను కైవసం చేసుకుంది. హెూరాహెూరీగా సాగిన తుదిపోరులో 35-28 పాయింట్ల తేడాతో భారత జట్టు అద్భుత విజయం సాధించింది. ఈ చారిత్రక విజయంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. భారత జట్టుకు అభినందనలు తెలిపారు. "భారత్ మరోసారి ప్రపంచకప్ విజయాన్ని సొంతం చేసుకుంది. మన ఆడబిడ్డల సత్తా, పట్టుదల ఈ గెలుపునకు నాయకత్వం వహించాయి. ఢాకాలో జరిగిన ఫైనల్స్‌లో చైనీస్ తైపీపై 35%-%28 తేడాతో విజయం సాధించి, వరుసగా రెండోసారి ప్రపంచకప్ గెలుచుకున్న భారత మహిళల కబడ్డీ జట్టుకు నా అభినందనలు. ఇది దేశం గర్వించదగ్గ క్షణం" అని చంద్రబాబు పేర్కొన్నారు."మన మహిళల కబడ్డీ జట్టు వరుసగా రెండోసారి మహిళా కబడ్డీ ప్రపంచకప్‌ను గెలవడం భారతదేశానికి ఎంతో గర్వకారణమైన క్షణం. హెూరాహెూరీగా సాగిన ఫైనల్‌లో చైనీస్ తైపీని 35%-%28 తేడాతో ఓడించారు. వరుసగా రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌లుగా నిలవడం వారి అచంచలమైన క్రమశిక్షణ, పట్టుదల, అద్భుతమైన ప్రతిభకు నిదర్శనం. ప్రపంచ వేదికపై మరోసారి భారతదేశ ప్రతిష్టను ఉన్నత స్థాయికి చేర్చిన మన క్రీడాకారిణులకు నా హృదయపూర్వక అభినందనలు" అంటూ లోకేశ్ ట్వీట్ చేశారు.

# నవంబర్ 30న చరిత్ర సృష్టించనున్న కోహ్లీ-రోహిత్

భారత క్రికెట్ అభిమానులకు గుడ్ న్యూస్. సౌతాఫ్రికాతో త్వరలో జరగబోయే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌తో స్టార్ ఆటగాళ్లైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ జోడీ ఒక అరుదైన చరిత్ర సృష్టించడానికి సిద్ధమవుతోంది. ఈ ఇద్దరు ఆటగాళ్లు అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పటివరకు కలిసి 391 మ్యాచ్‌లు ఆడారు. ఇదే సంఖ్యలో క్రికెట్ దిగ్గజాలైన సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్ జోడీ కూడా మ్యాచ్‌లు ఆడారు. కాబట్టి నవంబర్ 30న సౌతాఫ్రికా పై తొలి వన్డే కోసం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కలిసి మైదానంలోకి అడుగుపెడితే వారు సచిన్-ద్రవిడ్ రికార్డును అధిగమించి, భారతదేశం తరఫున అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన నంబర్ 1 జోడీగా చరిత్ర సృష్టించనున్నారు. ఈ వన్డే సిరీస్‌కు సంబంధించి బీసీసీఐ ఆదివారం (నవంబర్ 23) స్క్వాడ్‌ను ప్రకటించింది. రెగ్యులర్ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ గాయం కారణంగా ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. దీంతో వికెట్ కీపర్-బ్యాట్స్‌మెన్ అయిన కేఎల్ రాహుల్‌కు తాత్కాలిక కెప్టెన్‌గా బాధ్యతలు అప్పగించారు. భారత గడ్డపై చాలా రోజుల తర్వాత రోహిత్-కోహ్లీ జోడీని చూడబోతున్నందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చివరిసారిగా వీరిద్దరూ స్వదేశంలో ఐపీఎల్ టోర్నమెంట్‌లో మాత్రమే కలిసి ఆడారు. రోహిత్-కోహ్లీ జోడీతో పాటు, సచిన్-ద్రవిడ్ (391), ద్రవిడ్-గంగూలీ (369), సచిన్-కుంబ్లే (367), సచిన్-గంగూలీ (341) జోడీలు కూడా




అంతర్జాతీయ క్రికెట్‌లో ఎక్కువ మ్యాచ్‌లు ఆడిన అగ్రశ్రేణి భారత జోడీలలో ఉన్నాయి. భారత్, సౌతాఫ్రికా మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ నవంబర్ 30 నుంచి ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లు రాంచీ, రాయ్‌పూర్, విశాఖపట్నంలో జరగనున్నాయి. మొదటి వన్డే నవంబర్ 30న రాంచీలో, రెండో వన్డే డిసెంబర్ 3న రాయ్‌పూర్‌లో, చివరి వన్డే డిసెంబర్ 6న విశాఖపట్నంలో జరగనుంది.వన్డే సిరీస్‌కు భారత స్క్వాడ్: కేఎల్ రాహుల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, తిలక్ వర్మ, రిషబ్ పంత్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, రుతురాజ్ గైక్వాడ్, ప్రసిద్ కృష్ణ, ధ్రువ్ జురెల్, అర్ష్‌దీప్ సింగ్

## సూపర్ ఓవర్‌లో పాక్ విజయం!

ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టీ20 టోర్నీలో పాకిస్థాన్ షాహీన్స్ టీమ్ విజేతగా నిలిచింది. ఆదివారం దోహా వేదికగా బంగ్లాదేశ్-ఏ జట్టుతో హెూరాహెూరీగా సాగిన ఫైనల్లో పాకిస్థాన్ షాహీన్స్ సూపర్ ఓవర్‌లో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ షాహీన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 125 పరుగులే చేసింది.సాద్ మసూద్(26 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 38), అర్ఫత్ మిన్హాస్(23 బంతుల్లో 4 ఫోర్లతో 25), మాజ్ సదకత్(18 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 23) టాప్ స్కోరర్లుగా నిలిచారు. బంగ్లాదేశ్-ఏ బౌలర్లలో రిపన్ మోండల్(3/25) మూడు వికెట్లు తీయగా.. రకిబుల్ హసన్(2/16) రెండు వికెట్లు పడగొట్టాడు. మెహెరోబ్, జిషన్ అలామ్, అబ్దుల్ గఫ్ఫర్ సక్లెయిన్ తలో వికెట్ తీసారు.అనంతరం బంగ్లాదేశ్-ఏ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 125 పరుగులే చేసింది. హబిబుర్ రెహ్మాన్ సోహన్(17 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 26), రకిబుల్ హసన్(21 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 24) టాప్ స్కోరర్లుగా నిలిచారు. పాకిస్థాన్ షాహీన్స్ బౌలర్లలో సుఫియన్ ముఖీమ్(3/11)మూడు వికెట్లు తీయగా.. అర్ఫత్ మిన్హాస్(2/5), అహ్మద్ దనియల్(2/11) రెండేసి వికెట్లు పడగొట్టారు.

ఆఖరి ఓవర్‌లో బంగ్లాదేశ్ విజయానికి 7 పరుగులు అవసరం కాగా.. ఆ జట్టు కేవలం 6 పరుగులే చేసింది. పాక్ బౌలర్ అహ్మద్ దనియల్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేశాడు. దాంతో సూపర్ ఓవర్‌కు దారి తీసింది. సూపర్ ఓవర్‌లో బంగ్లాదేశ్..3 బంతులే ఆడి 6 పరుగులే చేసి ఆలౌటైంది. సూపర్ ఓవర్ రూల్స్ ప్రకారం రెండు వికెట్లు పడితే ఆలౌటైనట్లు. మరోసారి అహ్మద్ దనియల్ అద్భుత బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు.

# గంభీర్ పేరుతో సోషల్ మీడియాలో గందరగోళం

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పేరుతో సైబర్ కేటుగాళ్లు సోషల్ మీడియాలో గందరగోళం సృష్టించారు. గంభీర్ పేరు, ఫోటోతో ఒక నకిలీ ఎక్స్ (ట్విట్టర్) ఖాతాను సృష్టించి, అందులో ఆయన కోచ్ పదవి నుంచి తప్పుకుంటున్నట్లు పోస్ట్ చేయడం క్రికెట్ వర్గాల్లో కలకలం రేపింది. ఇటీవల భారత జట్టు ప్రదర్శనపై, ముఖ్యంగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా పర్యటనల సమయంలో మిశ్రమ ఫలితాలు వస్తున్న నేపథ్యంలో, సోషల్ మీడియాలో గంభీర్ పేరుతో ఉన్న ఒక ఖాతా నుంచి ఒక పోస్ట్ ప్రత్యక్షమైంది. "భారత జట్టు కోచ్ బాధ్యతల నుంచి నేను తప్పుకుంటున్నాను. నాకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు" అనే అర్థం వచ్చేలా ఆ పోస్ట్ ఉంది. అచ్చం గంభీర్ అధికారిక ఖాతాను పోలిన విధంగా ప్రొఫైల్ పిక్చర్, బయో ఉండటంతో చాలా మంది నెటిజన్లు, క్రికెట్ అభిమానులు ఇది నిజమే అని పొరపడ్డారు. దీంతో క్షణాల్లో ఆ పోస్ట్ వైరల్ అయ్యింది. జట్టు వరుస వైఫల్యాల కారణంగా గంభీర్ ఈ నిర్ణయం తీసుకున్నారని కొందరు అభిమానులు ఆవేదన వ్యక్తం చేయగా, మరికొందరు ఇది ఫేక్ న్యూస్ అని అనుమానం వ్యక్తం చేశారు. ఆ పోస్ట్ చేసిన ఖాతాను నిశితంగా పరిశీలించగా, అది గంభీర్ అధికారిక ఖాతా కాదని తేలింది. గంభీర్ అధికారిక



ఖాతాకు ఉండే 'వెరిఫైడ్ టిక్' లేకపోవడం, యూజర్ నేమ్‌లో చిన్నపాటి మార్పులు ఉండటాన్ని గమనించిన నెటిజన్లు.. ఇది సైబర్ కేటుగాళ్ల పనే అని నిర్ధారించారు. ఎవరో ఆకతాయిలు కావాలనే గందరగోళం సృష్టించడానికి ఈ పని చేశారని స్పష్టమైంది. ఇలాంటి సున్నితమైన సమయంలో బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వారి పేరుతో ఫేక్ న్యూస్ సృష్టించడంపై అభిమానులు మండిపడుతున్నారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి వార్తను గుడ్డిగా నమ్మవద్దని, అధికారిక ఖాతాల నుండి వచ్చే సమాచారాన్నే పరిగణలోకి తీసుకోవాలని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం గంభీర్ తన కోచ్ బాధ్యతల్లోనే కొనసాగుతున్నారు.

# విడుదలకు ముందే పెద్ది రికార్డులు

## చికిరి చికిరి పాటకు వందమిలియన్ వ్యూస్



విడుదలకు ముందే రికార్డులను తన ఖాతాలో వేసుకుంటోంది 'పెద్ది'. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. దానికి కారణం ఇటీవల విడుదలైన 'చికిరి చికిరి' పాటనే. ఈ పాట రికార్డు స్థాయిలో వ్యూస్‌ను సొంతం చేసుకుంటోంది. 16 రోజుల్లో అన్ని భాషల్లో కలిపి 100 మిలియన్ల వ్యూస్‌ను (10 కోట్ల వ్యూస్) సొంతం చేసుకున్నట్లు టీమ్ తాజాగా తెలిపింది. దీంతో రామ్‌చరణ్ అభిమానులు సంబరపడుతున్నారు. మరోవైపు ఈ పాటలోని హుక్‌స్టెప్ కూడా బాగా వైరలవుతోంది. దీన్ని ఏకంగా సోషల్ మీడియాలో 5 లక్షల మందికి పైగా రీక్రియేట్ చేసినట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. ఇన్‌స్టా, యూట్యూబ్‌లో కలిపి ఇంతమంది దీన్ని రీల్స్ చేసినట్లు వెల్లడించింది. అలాగే హీరో నితిన్ కుమారుడు కూడా ఈ పాటకు చేతులు కదుపుతూ ఎంజాయ్ చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది. చికిరి చికిరి... అంటూ సాగే ఈ సాంగ్‌ను ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్వరపరచగా, మోహిత్ చౌహాన్ ఆలపించారు. బాలాజీ సాహిత్యం అందించారు. ఇందులో జాన్వీకపూర్ అచ్చియ్యమ్మగా కనిపించనున్నారు.

# మోక్షు డెబ్యూ.. హీరోయిన్ ఫిక్సా?



నందమూరి బాలకృష్ణ వారసుడు మోక్షజ్ఞ తేజ.. టాలీవుడ్ ఎంట్రీ కోసం అటు సినీ ప్రియులు.. ఇటు అభిమానులు ఎంతో వెయిట్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇదిగో.. అదిగో అంటూ కొన్నేళ్లు గడిచిపోయాయి. ఆ తర్వాత గత ఏడాది మోక్షు బర్త్ డే నాడు.. టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మతో డెబ్యూ మూవీ ఉంటుందని ప్రకటించారు.


కానీ ఆ సినిమా కార్యరూపం దాల్చలేదు. రద్దు కూడా అయినట్లే. దీంతో మోక్షు డెబ్యూ డైరెక్టర్ ఆయనే.. ఈయనే అంటూ ఇటీవల రకరకాల వార్తలు వచ్చాయి. రీసెంట్ గా బాలయ్య.. తన కుమారుడు ఎంట్రీ గురించి మాట్లాడిన విషయం తెలిసిందే. ఇఫీ వేడుకల్లో.. బ్లాక్ బస్టర్ హిట్ మూవీ ఆదిత్య 369కి సీక్వెల్ తో మోక్షజ్ఞ ఎంట్రీ ఇస్తాడని క్లారిటీ ఇచ్చారు.ఆదిత్య 369లో నటించి సూపర్ హిట్ అందుకున్న బాలయ్య.. ఇప్పుడు ఆయన కొడుకు ఆ మూవీ సీక్వెల్ తో హీరోగా పరిచయం చేయనున్నారు. క్రిష్ జాగర్లమూడి మోక్షు డెబ్యూకు దర్శకత్వం వహిస్తారని తెలుస్తోంది. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందని.. త్వరలో అధికారికంగా ప్రాజెక్టు అనౌన్స్మెంట్ ఇవ్వనున్నారని సమాచారం.

అయితే ఇప్పుడు మోక్షజ్ఞ డెబ్యూ మూవీ హీరోయిన్ గురించి సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఫిమేల్ లీడ్ ను ఫిక్స్ చేశారని టాక్ వినిపిస్తోంది. బాలీవుడ్ యంగ్ హీరోయిన్ రాషా తడానీ.. మోక్షు సరసన నటించనుందని ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. అందులో నిజమెంతో తెలియకపోయినా.. వార్తలు మాత్రం వినిపిస్తున్నాయి.కాగా.. సీనియర్ బ్యూటీ రవీనా టాండన్, అనిల్ తడానీ కుమార్తె అయిన రాషా ఇప్పటికే బాలీవుడ్ లో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఆమె చేసిన ఉయ్యమ్మ సాంగ్ ఫుల్ వైరల్ గా మారి అందరినీ ఆకట్టుకుంది. మంచి క్రేజ్ కూడా తెచ్చిపెట్టింది. ఇప్పుడు బాలయ్య కుమారుడి డెబ్యూ మూవీలో హీరోయిన్ గా నటించనుందని ప్రచారం జరుగుతోంది.అయితే ఇటీవల ఆమె టాలీవుడ్ డెబ్యూ ప్రాజెక్టు అనౌన్స్మెంట్ వచ్చిన విషయం తెలిసిందే. ఘట్టమనేని వారసుడు, దివంగత కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఫస్ట్ మూవీలో హీరోయిన్ రోల్ కు రాషానే సెలెక్ట్ చేశారు. రీసెంట్ గా అధికారికంగా ప్రకటించారు. ఇప్పుడు మోక్షు డెబ్యూ మేకర్స్ కూడా రివీల్ చేస్తారని తెలుస్తోంది. మరి చూడాలి అందులో ఎంతవరకు నిజముందో.



రాషా తడానీ

# కెవిఎన్ ప్రొడక్షన్‌లో రావిపూడి




ఈతరం దర్శకుల్లో దర్శకుడు అనిల్ రావిపూడి వినోదం ప్రధానంగా ఆయన సినిమాలుంటాయి. ఈ ఏడాది సంక్రాంతికి వెంకటేశ్‌తో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్నారు. వచ్చే ఏడాది మెగాస్టార్ చిరంజీవితో 'మన శంకర వరప్రసాద్‌గారు' సినిమాతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే తాజాగా ఆయన గురించి ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతుంది. దక్షిణాదిలో భారీ సినిమాలు చేస్తున్న కెవిఎన్ ప్రొడక్షన్‌లో ఓ సినిమా చేయబోతున్నారని వార్తలొచ్చాయి. ఆ వార్తలు నిజమే అన్నట్లు ఆదివారం అనిల్ రావిపూడి పుట్టినరోజు సందర్భంగా క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ నిర్మాణ సంస్థ ఓ పోస్ట్ పెట్టడంతో ఈ కాంబోలో సినిమా ఖాయమని క్లియర్ అయింది. అయితే ఇందులో హీరో ఎవరు? అనే వివరాలు వెల్లడించలేదు. ఇదే బ్యానర్‌లో చిరంజీవి – బాబీ కొల్లి సినిమా, యష్, విజయ్ ప్రాజెక్టులు ఉన్నాయి. అలాగే పవన్‌కల్యాణ్, లోకేశ్ కనకరాజ్ కాంబోలో కూడా ఓ సినిమా ఉంటుందని టాక్ నడుస్తోంది.

# ఫిబ్రవరి 13న స్వయంభు

హీరో నిఖిల్ సిద్ధార్థ అభిమానుల నిరీక్షణకు చిత్ర బృందం తెరదించింది. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న భారీ పీరియడ్ యాక్షన్ డ్రామా 'స్వయంభు' విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని 2026 ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు.

కొంతకాలంగా ఈ సినిమా నుంచి ఎలాంటి అప్‌డేట్ రాకపోవడంతో ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. విడుదల తేదీ ప్రకటన సందర్భంగా 'రైజ్ ఆఫ్ స్వయంభు' పేరుతో ఓ ప్రత్యేక వీడియోను కూడా రిలీజ్ చేశారు. ఇందులో యుద్ధ సన్నివేశాలు, భారీ సెట్టింగులు, నిఖిల్ వారియర్ లుక్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. మొత్తం మీద ఈ వీడియో గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఇక, ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని చిత్ర బృందం వెల్లడించింది. త్వరలోనే ప్రమోషన్లు పెద్ద ఎత్తున ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.

'కార్తికేయ 2'తో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు పొందిన నిఖిల్, ఈ చిత్రంతో పాన్ వరల్డ్ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళంతో పాటు చైనీస్, స్పానిష్, అరబిక్ భాషల్లో కలిపి మొత్తం 8 భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సంయుక్తా, నభా నటేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తుండగా, ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. 'బాహుబలి' ఫేమ్ కె.కె. సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ, 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.



# నటి శ్రద్ధాకపూర్‌కు గాయం



నటి శ్రద్ధాకపూర్ ప్రస్తుతం 'ఈఠా'లో నటిస్తోన్న సందర్భంగా ఇటీవల ఈ సినిమా షూటింగ్‌లో ఆమె కాలుకు గాయమైంది. దీంతో అభిమానులు ఆందోళన చెందారు. తాజాగా తన హెల్త్ అప్‌డేట్‌ను శ్రద్ధా పంచుకున్నారు. విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒక అభిమాని గాయం ఎలా ఉందని పోస్ట్ పెట్టగా దానికి ఆమె రిప్లై ఇచ్చారు. 'పెద్ద దెబ్బ ఏం కాదు.. కాలి కండరానికి దెబ్బ తగిలి కొంచెం ఫ్రాక్చర్ అయింది. డాక్టర్లు విశ్రాంతి తీసుకోమన్నారు. నేను క్షేమంగానే ఉన్నా. త్వరలోనే మీ ముందుకు వస్తాను' అని చెప్పారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో 'ఈఠా' తెరకెక్కుతోంది. ఇటీవల నాసిక్‌లో ఒక భారీ సెట్ వేసి షూటింగ్ నిర్వహిస్తుండగా శ్రద్ధా కాలికి గాయమైంది. భారీ కాస్ట్యూమ్స్ ధరించి డ్యాన్స్ వేస్తుండగా ప్రమాదం జరిగింది. ఎడమ కాలుకు గాయం కావడంతో షూటింగ్‌ను కొన్ని రోజులు నిలిపివేశారు . ఈ సినిమా కోసం ఆమె 15 కిలోల బరువు పెరిగినట్లు కూడా వార్తలు వచ్చాయి.

# సంక్రాంతి రేసు నుంచి తప్పుకున్న నవీన్ పోలిశెట్టి?



యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి, మీనాక్షీ చౌదరి జంటగా మారి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం అనగనగా ఒక రాజు. సితార ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ పై సూర్య దేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, ప్రమోషనల్ కంటెంట్ అంతా మంచి ఆదరణను అందుకున్నాయి. ఎన్నో ఏళ్లగా ఈ సినిమా రిలీజ్ కోసం ఎదురుచూస్తూ ఉంది. ఎట్టకేలకు వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో రాజుగారు దిగుతున్నారు అంటూ మేకర్స్ ప్రకటించారు. దీంతో అందరూ ఈ సినిమా కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. ఈ మధ్యనే నవీన్ పోలిశెట్టి ప్రమోషన్స్ తో అదరగొట్టాడు. అయితే అది కూడా మూడునాళ్ళ ముచ్చటగా మారిపోయింది. అందుతున్న సమాచారం ప్రకారం ఈ సంక్రాంతి బరిలో కూడా రాజుగారు రావడం లేదని తెలుస్తోంది. చిరంజీవి మన శంకరవరప్రసాద్ గారు, ప్రభాస్ ది రాజా సాబ్, రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తి, విజయ్ జన నాయగన్, శర్వానంద్ నారీ నారీ నడుమ మురారి లైన్ లో ఉన్నాయి. ఇక ఇన్ని సినిమాలతో పోటీ తట్టుకోలేక రాజుగారు డ్రాప్ అయ్యారని, సంక్రాంతి రేసు నుంచి నవీన్ తప్పుకున్నాడని వార్తలు వస్తున్నాయి. అందుకే ప్రమోషన్స్ కూడా మధ్యలోనే ఆపేశారని సమాచారం. త్వరలోనే ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా తెలపనున్నారట. మరి ఇందులో నిజమెంత అనేది తెలియాల్సి ఉంది.



# జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కు డైరెక్టర్ మారుతి క్షమాపణ

ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'రాజాసాబ్' సినిమా ఈవెంట్‌లో తాను చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన వివాదంపై దర్శకుడు మారుతి స్పందించారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు ఆయన క్షమాపణలు తెలిపారు. ఎవరినీ అగౌరవపరిచే ఉద్దేశం తనకు లేదని, తన మాటలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే చింతిస్తున్నానని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లోని విమల్ థియేటర్‌లో ఆదివారం సాయంత్రం 'రాజాసాబ్' ఫస్ట్ సింగిల్ లాంఛ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ.. 'ఈ సినిమా తర్వాత కాలర్ ఎగరేసుకుంటారు లాంటి మాటలు నేను చెప్పను. ప్రభాస్ లాంటి కటౌట్‌కు అవి చాలా చిన్న మాటలు' అని అన్నారు. ఈ వ్యాఖ్యలు 'కాలర్ ఎగరేయడం' అనే పదం తమ హీరోకు చెందిందని భావించిన జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు ఆగ్రహం తెప్పించాయి. దీంతో సోషల్ మీడియాలో మారుతిపై ట్రోలింగ్ మొదలైంది. ఈ వ్యవహారం ప్రభాస్, ఎన్టీఆర్ అభిమానుల మధ్య మాటల యుద్ధానికి దారితీయడంతో మారుతి వివరణ ఇచ్చారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. "ఎన్టీఆర్ గారి ప్రతి అభిమానికి హృదయపూర్వకంగా క్షమాపణలు చెబుతున్నాను. ఎవరినీ బాధపెట్టడం నా ఉద్దేశం కాదు. కొన్నిసార్లు ఉత్సాహంలో మాట్లాడినప్పుడు మాటలు తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. నా వ్యాఖ్యలు మిమ్మల్ని బాధపెట్టినందుకు చింతిస్తున్నాను" అని పేర్కొన్నారు. ఎన్టీఆర్ పట్ల, ఆయన అభిమానుల పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని, తన ఉద్దేశాన్ని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నట్లు మారుతి తన పోస్ట్‌లో వివరించి ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నం చేశారు.